# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :289 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: మంగళవారం 28-01-2025 | పేజీలు:4 వెల: 2.00


## మహాకుంభమేళాలో అమిత్ షా..

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ లో జరుగుతున్న మహాకుంభమేళా లో కేంద్ర హెూం మంత్రి అమిత్ షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంగా, యమున, సరస్వతీ నదులు కలిసే త్రివేణీ సంగమంలో పుణ్య స్నానాలు ఆచరించారు. అనంతరం ఘాట్ వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి అధికారులతో సమావేశాలు నిర్వహించి మహాకుంభ్ ఏర్పాట్లపై సమీక్షించారు. మరోవైపు షా పర్యటన నేపథ్యంలో నగరంలో అధికారులు భద్రతను కట్టుదిట్టం చేశారు. కీలక కూడళ్లు, కార్యక్రమాల వేదికలపై నిఘా పెంచారు. ఈ మహాకుంభమేళాలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కూడా పాల్గొననున్నారు. ఫిబ్రవరి 5వ తేదీన ప్రధాని ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. అదేవిధంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మ సైతం మహాకుంభ్‌ను సందర్శించే అవకాశం ఉందని తెలిసింది. ఫిబ్రవరి 10వ తేదీన రాష్ట్రపతి ముర్ము మహాకుంభమేళాకు వెళ్లనున్నట్లు సమాచారం. ఫిబ్రవరి 1వ తేదీన ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ సైతం ప్రయాగ్‌రాజ్ వెళ్లనున్నారు. సంక్రాంతి రోజున ప్రారంభమైన (జనవరి 13) మహా కుంభమేళా ఫిబ్రవరి 26వ తేదీన మహాశివరాత్రితో ముగుస్తుంది.

## సుప్రీంకోర్టులో జగన్‌కు ఊరట..బెయిల్ రద్దు పిటిషన్ తిరస్కరించిన ధర్మాసనం



న్యూఢిల్లీ,జనవరి27: సుప్రీం కోర్టులో ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి భారీ ఊరట లభించింది.. వైఎస్ జగన్ బెయిల్‌ను రద్దు చేయాలంటూ.. మరోవైపు జగన్ పై ఉన్న కేసులను మరో రాష్ట్రానికి బదిలీ చేయాలంటూ ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణం రాజు గతంలో వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది.. రఘురామ కృష్ణంరాజు పిటిషన్ పై జస్టిస్ నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్ర శర్మల ధర్మాసనం విచారణ జరిపింది.. చివరకు ఆ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నట్టు వెల్లడించింది.. ఇక, జగన్ బెయిల్ ను రద్దు చేయాలంటూ వేసిన పిటిషన్ ను ఉపసంహరించుకున్నారు పిటిషనర్.. ఈ పరిణామాలతో వైసీపీ అధినేత వైఎస్ జగన్‌కు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించినట్టు అయ్యింది..అయితే కేసులకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. జగన్‌ను కేసులను రోజు వారీ విచారణ చేపట్టాలని న్యాయస్థానం ఆదేశించింది. జగన్ కేసుల బదిలీకి నిరాకరించిన సుప్రీంకోర్టు, తెలంగాణ హైకోర్టులో జగన్ అక్రమాస్తుల కేసు పర్యవేక్షణ నేపథ్యంలో వేరే రాష్ట్రానికి బదిలీ చేయాల్సిన అవసరం లేదని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. అలాగే జగన్ బెయిల్‌ను రద్దు చేయాలన్న పిటిషన్‌పై కూడా ప్రత్యేకంగా విచారణ అవసరం లేదని చెప్పింది. గతంలో సుప్రీంకోర్టు ఎమ్మెల్యే, ఎంపీల కేసుల విషయంలో ఇచ్చిన తీర్పు ఈ కేసుకు కూడా వర్తిస్తుందని సుప్రీం ధర్మాసనం తేల్చిచెప్పింది. ట్రయల్ కోర్టు... రోజు వారీ విచారణకు తీసుకోవాలని, హైకోర్టు కూడా పర్యవేక్షణ చేయాలని అందువల్ల మరో రాష్ట్రానికి బదిలీ చేయాల్సిన అవసరం లేదని జస్టిస్ నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్ర మిశ్రా ధర్మాసనం తేల్చిచెప్పింది. దీంతో పిటిషన్‌ను వెనక్కి తీసుకుంటామని రఘురామ తరపు న్యాయవాది బాలాజీ సుబ్రహ్మణ్యం కోర్టుకు తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం జగన్ బెయిల్ రద్దు, కేసుల ట్రయల్ విచారణ ధర్మాసనం మార్పు చేయాలని రఘురామకృష్ణరాజు సుప్రీం కోర్టులో ఓ పిటిషన్ వేశారు. గతంలో ఈ పిటిషన్‌ను జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ పంకజ్ మిత్తల్ ధర్మాసనం విచారించగా.. ఆ తర్వాత జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్రశర్మ ధర్మాసనం ముందుకు వెళ్లింది. గత 12 ఏళ్లుగా ట్రయల్ ఒక్క అడుగు కూడా ముందుకు కదల్లేదని.. ఒక్క డిశ్చార్జ్ అప్లికేషన్ కూడా డిస్పోజ్ చేయలేదని రఘురామ తరపు న్యాయవాది బాలాజీ సుబ్రహ్మణ్యం కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. బదిలీ సాధ్యం కాదని సుప్రీంకోర్టు గత విచారణలోనే చెప్పిందని.. తాము ఇప్పుడు కేసు మానిటరింగ్ పూర్తి స్థాయిలో జరగాలని కోరుతున్నామని తెలిపారు. అయితే.. సీబీఐ కేసుల వివరాలు, ప్రస్తుత పరిస్థితిని వివరిస్తూ సీబీఐ అఫిడవిట్ దాఖలు చేసిందని దర్యాప్తు సంస్థ తరపు న్యాయవాది పేర్కొన్నారు. మరోవైపు.. ఈ కేసును హైకోర్టు మానిటర్ చేస్తోందని.. ఇంకా కేసు అక్కడ పెండింగ్‌లో ఉందని జగన్ తరపు న్యాయవాది ముకుల్ రోహత్గీ తెలిపారు. అన్నివైపులా వాదనలు విన్న ద్విసభ్య ధర్మాసనం.. చివరకు రఘురామ పిటిషన్‌ను డిస్మస్ చేస్తూ ద్విసభ్య ధర్మాసనం ఇవాళ తీర్పు ఇచ్చింది.

## ఆ సినిమాలోని కోట శ్రీనివాస్ రావు క్యారెక్టర్ మాదిరి..



హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఆహా నా పెళ్లంట సినిమాలోని కోట శ్రీనివాస్ రావు క్యారెక్టర్ మాదిరి సీఎం రేవంత్ రెడ్డి పరిపాలన ఉందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్వీ క్యాలెండర్ ఆవిష్కరణ సందర్భంగా కేటీఆర్ ప్రసంగించారు. ఇవాళ మనం డిజిటల్ యుగంలో ఉన్నాం.. ఇవాళ ఒక నిజం కడప దాటే లోపే అబద్ధం ఊరంతా తిరిగిచ్చే పరిస్థితి. ఆహా నా పెళ్లాంట సినిమాలో కోట శ్రీనివాస్ రావు క్యారెక్టర్ పిసినారిగా ఉంటుంది. చికెన్ పెడుతా అని ఇంటికి కొందరిని పిలుస్తాడు. ఇక ప్లేట్‌లో అన్నం, చట్నీ వేసి.. ముందట కోడిని వేలాడదీస్తాడు.. ఇదే చికెన్ అని ఊరిస్తాడు. ఇవాళ రేవంత్ రెడ్డి ప్రభుత్వ తీరు అలాగే ఉంది. ఆరునూరైనా సరే.. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేసి తీరుతాం, చేసి చూపెడుతా అని గంభీరమైన డైలాగులు కొట్టారు. ఇది చేస్తాం.. అది చేస్తాం.. పొడిచెస్తాం అని 420 హామీలిచ్చి అధికారంలోకి వచ్చారు. ఇవాళ 14వ నెల నడుస్తుంది. ఇప్పుడు కూడా సిగ్గు లేకుండా అబద్ధాలు చెబుతున్నారు. అబద్దాలు చెబితే కూడా అతికేలా ఉండాలి. కానీ ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం మాటలు వింటే నవ్వాలో ఏడ్వాలో తెలుస్తలేదు. రేషన్ కార్డులు జారీ చేయడం చారిత్రాత్మక కార్యక్రమం అని సీఎం మాట్లాడుతున్నారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. ఒక్క రేషన్ కార్డు కూడా బీఆర్ఎస్ ఇవ్వలేదని చెబుతుండు. 2021 జులైలో రేషన్ కార్డులు ఇస్తూ తన సొంత నియోజకవర్గం మధిరలో భట్టి విక్రమార్క ఫొటోలు దిగారు. మన ప్రభుత్వంలో 6 లక్షల 50 వేలు రేషన్ కార్డులు ఇచ్చాం. మీ సేవల దరఖాస్తు పెట్టుకుంటే ఇచ్చాం. కానీ రేవంత్ లాగా ప్రభుత్వ పైసలతో ఆర్భాటాలు చేసి సన్నాయి నొక్కులు నొక్కలేదు అని కేటీఆర్ స్పష్టం చేశారు. కాంగ్రెసోళ్లు గోబెల్స్ వారసులు. ఒకటి కాదు రెండు కాదు.. 420 హామీలు ఇచ్చారు. ఎస్సీ డిక్లరేషన్, రైతు డిక్లరేషన్, బీసీ డిక్లరేషన్ ఇచ్చారు. విద్యార్థి డిక్లరేషన్ కూడా ఇచ్చారు. ఢిల్లీ నుంచి టూరిస్టులను తీసుకొచ్చి డిక్లరేషన్ల పేరిట ఊదరగొట్టారు. ఇవి నమ్మతలేరని చెప్పి బాండ్ పేపర్లను పట్టుకుని అఫిడవిట్లు తయారు చేశారు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని ఒట్లు పెట్టి డ్రామాలు ఆడారు. గ్యారెంటీ కార్డులు పంచారు. జోసెఫ్ గోబెల్స్ వారసుల మాదిరిగా విస్తృతంగా అబద్ధాలు ప్రచారం చేశారని కేటీఆర్ మండిపడ్డారు.

## కాంగ్రెస్ హామీలపై ప్రజల్లో తిరుగుబాటు



నిజామాబాద్,జనవరి27: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై గ్రామసభల సాక్షిగా కాంగ్రెస్ సర్కారును ప్రజలు అనేకచోట్ల నిలదీసారని, ప్రజలకు సమాధానం చెప్పే స్థితిలో పాలకులు లేరని మాజీమంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు,రేషన్ కార్డుల సర్కస్ ఫీట్లు, లోకల్ బాడీ ఓట్ల కోసం కాంగ్రెస్ పడుతున్న పాట్లు అని ఎద్దేవా చేశారు. కేవలం స్థానిక ఎన్నికల్లో పట్టుకోసం చేస్తున్న కసరత్తు తప్ప ప్రజల మేలుకోరి చేసే పనులు మాత్రం కావన్నారు. అమలు కాని ఆరు గ్యారంటీలే కాంగ్రెస్ ప్రభుత్వ పతనానికి నాంది అని పేర్కొన్నారు. గ్రామసభల్లో ప్రజలు తిరగబడుతున్నారని తెలిసి కూడా బుకాయించారని అన్నారు. ఏడాది దాటినా ఆరు గ్యారంటీలకే గతి లేదని, ఇక ఇండ్లు, రేషన్ కార్డు ఇస్తామంటే నమ్మేదెవరని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డుల మంజూరు పేరుతో నిర్వహిస్తున్న గ్రామసభల్లో ప్రజల తిరుగుబాటు కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక పాలనకు నిలువెత్తు నిదర్శనమని వేముల పేర్కొన్నారు. ఆరు గ్యారంటీలకే ఉప్పు పాతరేసి కొత్తగా ఈ డ్రామాలేమిటని ప్రజలు నిలదీస్తున్నారని తెలిపారు. అక్కడక్కడ హామీల అమలుపై ఎమ్మెల్యేలను ప్రజలు నిలబెట్టి అడిగారని అన్నారు. ఇండ్లు ఎప్పుడు కట్టిస్తారంటూ మహిళలు తిరగబడ్డారని గుర్తుచేశారు. అబద్దాలు చెబుతూ అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారన్నారు. స్థానిక ఎన్నికల్లో గెలవాలని మోసాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ జీరో కాక తప్పదన్నారు. గ్రామసభల సమయంలో సీఎం రేవంత్ రెడ్డి దేశంలోనే లేరని, మంత్రులు పత్తా లేకుండా పోయారని, ఎమ్మెల్యేలను గ్రామాలకు రానివ్వడం లేదన్నారు. హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రజల్లో తిరగలేరన్నారు. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలపై ప్రజలు తిరగబడ్డా రని వేముల అన్నారు. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి సహా కాంగ్రెస్ నేతలు పుట్టి పెరిగిన గ్రామాల్లో ఎన్నికల హామీలు నూరు శాతం అమలు జరిగాయని నిరూపిస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని, లేకుంటే కాంగ్రెస్ నేతలు రాజకీయాల నుం చి తప్పుకుంటారా అని సవాల్ విసిరారు. హామీల అమలులో ప్రజలకు సర్కారు వెన్నుపోటు పొడిచిందని మండిపడ్డారు. ప్రభుత్వ పథకాలను మండలానికి ఒక గ్రామం చొప్పున, జిల్లాలోని 35 మండలాల్లో కేవలం 35 గ్రామాల్లో ప్రారంభించారని తెలిపారు. ఏ ఊరికైనా వెళ్లి, నూరుశాతం హామీలు అమలవుతున్నాయని ప్రజలు చెబితే రాజకీయాలను వదిలేస్తానని, లేకుంటే కాంగ్రెస్ నాయకులు, రాజకీయాలు వదిలేసి ముక్కు నేలకు రాస్తారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీలవి తుగ్లక్ రాజకీయాలని ఆయ న విమర్శించారు. కాంగ్రెస్ నాయకుల వీరంగాలు, అక్రమ కేసులకు బీఆర్ఎస్ భయపడే రకం కాదన్నారు. తాము పోరాడుతూనే ఉంటామని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగడుతూనే ఉంటామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రజలను మోసగిస్తున్నదని, అందుకే ఎక్కడ చూసినా జనాగ్రహజ్వాలలే కనిపిస్తున్నాయన్నారు. ఇది ప్రజాపాలన కాదని, తుగ్లక్ పాలన అని విమర్శించారు. ఎన్నికల హామీల అమలులో ఘోర వైఫల్యాన్ని కప్పి పుచ్చుకోవడానికే రోజుకో నాటకం వేస్తున్నారని మండిపడ్డారు. పథకాల అమలుకు సంక్రాంతి పోయిందని, ఇప్పుడు శివరాత్రికి అంటున్నారని ఎద్దేవా చేశారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం



హైదరాబాద్,జనవరి27: తెలంగాణలో అత్యంత సంచలనం రేపిన ఫోన్‌ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇన్నాళ్లు అరెస్టులు, దర్యాప్తులు, విచారణల తర్వాత– ఈ కేసులో ఫస్ట్ బెయిల్ వచ్చింది. మాజీ ఏఎస్పీ తిరుపతన్నకు బెయిల్ లభించింది. షరతులతో కూడిన బెయిల్ ను సుప్రీంకోర్టు మంజూరు చేసింది. ట్యాపింగ్ కేసులో 10 నెలలుగా జైల్లో గడిపారు మాజీ పోలీస్ అధికారి తిరుపతన్న బెయిల్ అనంతరం విడుదల కానున్నారు. రాజకీయ నేతల ఆదేశాల మేరకు అందరి ఫోన్లను ట్యాప్ చేశారని, హైకోర్టు జడ్జిల ఫోన్లు కూడా ఇందులో ఉన్నాయని మాజీ ఏఎస్పీ తిరుపతన్నపై ఆరోపణలు ఉన్నాయి. ఆధారాలు చెరిపేయడంలోనూ ఆయనదే కీలక పాత్ర అనే అభియోగాలు కూడా ఉన్నాయి. 2023 డిసెంబర్ 3న ఎన్నికల ఫలితాలు రాగానే ఆధారాలు ధ్వంసం చేసిట్టుగా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ కేసులో అరెస్టైన తిరుపతన్న పది నెలలుగా జైలులో ఉండగా.. తాజాగా ఆయనకు బెయిల్ ఇచ్చింది సుప్రీం కోర్ట్. వాస్తవానికి ఫోన్ ట్యాపింగ్ కేస్ లో అరెస్ట్ అయ్యిన వారిలో మొదటి వ్యక్తి తిరుపతన్న.. ఫోన్ ట్యాపింగ్ కేసులో నలుగురిని గత ఏడాదిలో హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు.. అడిషనల్ ఎస్పీ ప్రణీత్ రావ్, అడిషనల్ ఎస్పీ భుజంగ రావ్, అడిషనల్ ఎస్పీ తిరుపతన్న, మాజీ టాస్క్ ఫోర్స్ డీసీపీ రాధాకిషన్ రావ్ లను పోలీసులు అరెస్ట్ చేసారు. దాదాపు 10 నెలలకు పైగా జైల్ లోనే ఉన్నారు. బయటికి వచ్చేందుకు అనేక సార్లు బెయిల్ పిటిషన్ లు దాఖలు చేసినప్పటికీ రిజెక్ట్ అవుతూ వచ్చాయి. హై కోర్టులో పలుమార్లు బెయిల్ పిటిషన్లు దాఖలు చేసినప్పటికీ ఇక్కడ ఊరట లభించలేదు. తాజాగా సుప్రీం కోర్టును ఆశ్రయించగా అడిషనల్ ఎస్పీ తిరుపతన్నకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. తిరుపతన్నను గత ఏడాది 24న ఫోన్ ట్యాపింగ్ కేసులో పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో అదే సమయంలో మరో అడిషనల్ ఎస్పీ భుజంగరావు ఉన్న సైతం పోలీసులు అరెస్టు చేశారు. వీరిద్దరూ అనేకసార్లు లోయర్ కోర్టుతో పాటు హైకోర్టులోను బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు. ఇప్పటివరకు ఎవరికీ పూర్తిస్థాయిలో బెయిల్ మంజూరు కాలేదు. ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలపై దేశ వ్యాప్తంగా చర్చ జరిగింది. రాజకీయ ప్రత్యర్థులు, హైకోర్టు జడ్జిలు, జర్నలిస్టుల ఫోన్లను ట్యాప్ చేసినట్టు పోలీసులు ఆరోపణలు మోపారు.. వీటికి సంబంధించి కోర్టులో ఇంకా కేసులు నడుస్తూనే ఉన్నాయి. ఈ కేసులో రెగ్యులర్ బెయిల్ పొందిన మొదటి వ్యక్తి తిరుపతన్న.. సుప్రీం కోర్టు ఆదేశాలతో జైలు నుంచి విడుదల కానున్నారు.

## మహాకుంభమేళాలో పెరుగుతున్న రద్దీ



ప్రయాగ్‌రాజ్,జనవరి27: మహాకుంభమేళాలో రోజురోజుకు భక్తుల తాకిడి పెరుగుతోంది. ప్రపంచవ్యాప్తంగా భక్తులు తరలివస్తున్నారు. త్రివేణి సంగమంలో పుణ్య స్నానం ఆచరిస్తే సకల శుభాలు కలుగుతాయనేది భక్తుల విశ్వాసం. అందుకే భువి నలుచెరుగుల నుంచి సాధుసంతులు, అఘోరాలు, మాన్యులు, సామాన్యులు ప్రయాగ్ రాజ్‌కు పోటెత్తుతున్నారు. దీంతో రోజురోజుకూ రద్దీ పెరుగుతోంది. ఇప్పటికే కోట్ల మంది భక్తులు స్నానం ఆచరించారు . ఇన్ని రోజులు ఒక లెక్క. ఈ నెల 29న పోటెత్తే రద్దీ మరో లెక్క. జనవరి 29 ఈసారి మహాకుంభమేళలో ప్రత్యేకం కానుంది. ఇప్పుడు అన్ని దారులు పవిత్ర ప్రయాగ్ రాజ్ వైపే.. భక్త జనసంద్రానికి తీరమా.. అన్నట్టుగా త్రివేణి సంగమం సకల జనుల సందడితో కిక్కిరిసిపోతుంది.. ఈ నెల 13న మొదలైన మహాకుంభమేళ వచ్చే నెల 26 వరకు కొనసాగుతోంది. విభుడు, దేవాదిదేవతలు దివి నుంచి దిగి వచ్చే అమృత కాలమే మహా కుంభమేళ. ఈ 45 రోజుల్లో ఏ రోజులు త్రివేణి సంగమంలో పుణ్య స్నానం ఆచరిస్తే సకల శుభాలు కలుగుతాయనేది భక్తుల విశ్వాసం. అందుకే భువి నలుచెరుగుల నుంచి సాధుసంతులు, అఘోరాలు, మాన్యులు, సామాన్యులు ప్రయాగ్ రాజ్‌కు పోటెత్తుతున్నారు. జనవరి 29 ఈసారి మహాకుంభమేళలో అద్వితీయమైన రోజు. బుధవారం మాఘమాస మౌని అమావాస్య మహిమాన్వితమైన సుదినంగా చెబుతున్నారు. మహాకుంభ మేళలో స్నానమాచరించ డమే ఎంతో పుణ్యం. ఇక మాఘ మాస మౌని అమావాస్య కలిసొచ్చిన వేళ.. గంగా స్నానం చేస్తే మరెంతో పుణ్యం. దానాలు చేస్తే జన్మ ధన్యం అనేది భక్తుల విశ్వాసం.. మౌని అమావాస్య రోజున అందరూ షాహి స్నాన్ ఆచరిస్తారు..మౌని అమావాస్య ధ్యానానికి జ్ఞానానికి చిహ్నం. ఆరోజు మౌనంగా వుంటూ ..పరమేశ్వుడిని ధ్యానిస్తూ పవిత్ర గంగా స్నానంచేసి పితృదేవుళ్లకు నీరాజనాలు అర్పిస్తారు. తద్వారా పూర్వీకులకు సద్గతులు కలగడం సహా అందరికీ సకల శుభాలు కలుగుతాయంటారు పండితులు. మహాకుంభ మేళానే ఎంతో మహిమాన్వితం. ఇక ఈసారి మౌని అమావాస్య కలిసిరావడం మరెంతో శుభప్రదం.. ప్పటికే మహా కుంభ మేళాలకు కోట్లలో తరలి వస్తున్నారు భక్తులు. ఇక మాఘ మాస మౌన అమావాస్య ఒక్కరోజే పది కోట్లకు మంచి భక్తులు తరలి వస్తారనేది అంచనా. మౌన అమావాస్య కోసం భారత రైల్వే 150 ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. ఎవరికీ ఎక్కడా ఎలాంటి అసౌకర్యం కలుగకుండా యూపీ సర్కార్ పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. ఈసారి ప్రయాగ్ రాజ్‌లో యువతరం జోరు వెల్లి విరుస్తోంది. ఎక్కడ చూసినా యువోత్సాహం కనిపిస్తోంది. పీఠాధిపతులు, సన్యాసులు, నాగా సాధువులు, పెద్దవాళ్లకు దీటుగా యువత కన్పిస్తున్నారు. భక్తిశ్రద్ధలతో కుంభమేళలో పాల్గొంటున్నారు. కుంభమేళాకు వస్తున్న యువత గురించి ప్రధాని మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు.. దేశంలోని యువత తమ ఆచార సంప్రదాయాలను తెలుసుకున్నప్పుడే మన మూలాలు బలపడతాయని ప్రధాని మోదీ అన్నారు.

## మీ పథకాలకు మీరు ఏమైనా పేర్లు పెట్టుకోండి..



హైదరాబాద్,జనవరి27: మీ పథకాలకు ఏమైనా పేర్లు పెట్టుకోండి.. కానీ కేంద్ర పథకాలకు పేర్లు మార్చితే ఊరుకోమని కేంద్ర మంత్రి బండిసంజయ్ అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర సంక్షేమ పథకాల పేర్లను మార్చితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, గరీబ్ కళ్యాణ్ యోజన వంటి పథకాలను రాష్ట్ర ప్రభుత్వ ప్రమేయం లేకుండా కేంద్రమే నేరుగా ప్రజలకే అందిస్తుందన్నారు. పరిస్థితి అంత వరకు తీసుకురావొద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. సంక్షేమ పథకాల అమలు విషయంలో పేదలకు ఎట్టి పరిస్థితిల్లోనూ తాము అన్యాయం చేయబోమని స్పష్టం చేశారు. ప్రజలందరికీ ఉచితంగా బియ్యం కేంద్రమే ఇస్తోంది కదా... గరీబ్ కళ్యాణ్ యోజన అని పేరు పెడితే తప్పేంది? ప్రధాని ఫోటో ఎందుకు పెట్టరు అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఖర్చయ్యే సంక్షేమ పథకాలకు ఎవరి పేరు పెట్టుకున్నా తమకు అభ్యంతరం లేదని.. కాంగ్రెస్‌కు నచ్చితే ఒసామా బిన్ లాడెన్, దావూద్ ఇబ్రహీం పేర్లు పెట్టుకున్నా అభ్యంతరం లేదంటూ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు. అభివృద్ధి విషయంలో కేంద్రం పూర్తిగా సహకరిస్తోందన్నారు. గత 10 ఏళ్లలో రూ.12 లక్షల కోట్లకుపైగా కేంద్రం ఖర్చు చేసిందని తెలిపారు. గ్రామాల్లో జరిగిన అభివృద్ధి అంతా కేంద్ర నిధులతోనే అని స్పష్టం చేశారు. రైతు భరోసా, కమ్యూనిటీ హాల్, స్మశాన వాటిక, వీధి దీపాలు, రోడ్ల పైసలన్నీ కేంద్ర ప్రభుత్వానివే అని చెప్పుకొచ్చారు. ఆరు గ్యారంటీలపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేనేలేదన్నారు. "మండలానికి ఒక గ్రామంలోనే నాలుగు పథకాలకు ఎంపిక చేసి లబ్ది చేయడమేంది? మిగిలిన గ్రామాల ప్రజలు కాంగ్రెస్‌కు ఓట్లేయలేదా? రాష్ట్ర ప్రజలకు ఇంత దుర్మార్గంగా చీటింగ్ చేస్తారా? రాష్ట్ర ప్రజలందరికీ లబ్ది చేకూరుస్తామని చెప్పి మండలానికి ఒక గ్రామానికి లబ్ది చేకూర్చడం నీచం. కాంగ్రెస్ నేతల జేబుల నుంచి రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు ఖర్చు చేస్తున్నారా? లేక పాకిస్తాన్..బంగ్లాదేశ్ నుంచి తెచ్చి ఖర్చు చేస్తున్నారా? ప్రజలు కట్టిన పన్నులతోనే కేంద్రమైనా, రాష్ట్రమైనా ఖర్చు చేస్తోంది కదా? గతంలో పీఎం ఆవాస్ యోజన పేరుతో 2 లక్షల 40 వేల ఇండ్లను కేంద్రం మంజూరు చేస్తే... కేసీఆర్ ఒక్క ఇల్లు కట్టకుండా ప్రజలను రోడ్డున పడేసింది నిజం కాదా? డబుల్ బెడ్రూం ఇండ్ల పేరుతో ప్రజలను మభ్యపెట్టి మోసం చేసింది నిజం కాదా?" అంటూ ప్రశ్నలు కురిపించారు. పద్మ అవార్డుల జాబితాను పంపేటప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి పంపాలని హితవుపలికారు. గద్దర్‌కు ఎట్లా పద్మ అవార్డులిస్తామని ప్రశ్నించారు. ఎంత మంది బీజేపీ కార్యకర్తలను మట్టు పెట్టారో తెలియదా అని అన్నారు. వందల మంది బీజేపీ కార్యకర్తలు నమ్మిన సిద్ధాంతం కోసం ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళన చేస్తే... నక్సలైట్లతో కలిసి హత్య చేయించిన వ్యక్తి గద్దర్ అంటూ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ సెంటిమెంట్‌తో ఎవరు లాభపడ్డారో... ఎవరు బలైపోయారో ప్రజలందరికీ అర్థమైందని కేంద్రమంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు.

### చైతన్య విద్యాసంస్థలకు భారీ షాక్

హైదరాబాద్, మాదాపూర్‌లోని శ్రీచైతన్య విద్యాసంస్థల సెంట్రల్ కిచెన్ లైసెన్స్‌ను ఆహార భద్రతా విభాగం అధికారులు రద్దు చేశారు. గత శుక్రవారం శ్రీచైతన్య కిచెన్‌ను ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. వేల మందికి భోజనం తయారు చేస్తున్న వంటగదిలో పాడైపోయిన ఆహార పదార్థాలు ఉన్నట్లు గుర్తించారు. సుమారు 125 కిలోల గడువు తీరిన ఆహార పదార్థాలను అధికారులు సీజ్ చేశారు. బియ్యం, కూరగాయలు, పప్పుదినుసులను అపరిశుభ్ర వాతావరణంలో స్టోర్ చేస్తున్నట్టు గుర్తించారు. కిచెన్, స్టోర్ రూమ్‌లో బొద్దింకలు, ఎలుకలు తిరుగుతున్నట్టు తేల్చారు. ఈ వంటగది నుంచే గ్రేటర్ హైదరాబాద్‌లోని చైతన్య కాలేజీల హాస్టళ్లకు ఆహారం సరఫరా చేస్తున్నట్టు అధికారులు గుర్తించారు.

అగ్రనేత



## సంపాదకీయం

మంగళవారం 28-01-2025

# కేంద్రం పట్టులోకి వర్సిటీలు

అధ్యాపక నియామకాలపై 2018లో జారీ చేసిన కనీస ప్రమాణాలు, అర్హతలను విశ్వవిద్యాలయాల నిధుల సంఘం (యూజీసీ) ఇటీవల రద్దు చేసింది. నూతన నిబంధనల పేరిట ఒక ముసాయిదాను వెలువరించింది. దాని ద్వారా ఉన్నత విద్యావ్యవస్థ మొత్తాన్ని కేంద్రం తన గుప్పిట్లోకి తీసుకుంటోందంటూ పలు రాష్ట్రాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.'వర్సిటీలు, కళాశాలల్లో అధ్యాపకులు, బోధనా సిబ్బంది నియామకం, పదోన్నతికి కనీస అర్హతలు, ఉన్నత విద్యలో ప్రమాణాల నిర్వహణకు మార్గదర్శకాలు-2025' పేరిట విశ్వవిద్యాలయ నిధుల సంఘం (యూజీసీ) ఇటీవల ఒక ముసాయిదాను విడుదల చేసింది. అందులోని అంశాలు బాగా వివాదస్పదమవుతున్నాయి. ఇప్పటిదాకా విశ్వవిద్యాలయాల అధిపతులైన ఉపకులపతుల (వైస్ ఛాన్సలర్ల) నియామకం రాష్ట్ర ప్రభుత్వ అధికార పరిధిలో ఉంది. నూతన ముసాయిదా ప్రకారం ఆ అధికారం ఛాన్సలర్లుగా ఉన్న గవర్నర్ల చేతుల్లోకి వెళ్తుంది. ఈ మార్పును బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా నిరసిస్తున్నాయి. తమిళనాడు, కేరళ వంటివి నూతన ముసాయిదాను వ్యతిరేకిస్తూ చట్టసభల్లో తీర్మానం కూడా చేశాయి. వైస్ ఛాన్సలర్ల నియామక ప్రక్రియను కేంద్రం తన గుప్పిట్లోకి తీసుకోవడాన్ని అవి వ్యతిరేకిస్తున్నాయి.దానిది ప్రేక్షక పాత్రే!కేంద్రం చర్యలతో ఉన్నత విద్యపై తమ పట్టును పూర్తిగా కోల్పోవాల్సి వస్తుందని ఆయా రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికే కేంద్ర-రాష్ట్ర సంబంధాలు బలహీనమయ్యాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఉమ్మడి జాబితాలోని విద్యపై కేంద్రం పట్టు సాధించాలని చూస్తుండటం సమాఖ్య స్ఫూర్తికి గొడ్డలిపెట్టు అని రాష్ట్రాలు విమర్శిస్తున్నాయి. ఇప్పటికే ఒకేసారి రెండు డిగ్రీలు, ఆన్‌లైన్ పాఠాలు అంటూ యూజీసీ మోతెక్కిస్తోంది. వాటి పర్యవసానాలను లోతుగా ఆలోచించినట్లు కనిపించదు. నాలుగేళ్ల డిగ్రీకోర్సు ప్రణాళిక అస్తవ్యస్తమైంది. ఈ నేపథ్యంలో యూజీసీ తాజా ముసాయిదా మరింతగా విమర్శల పాలవుతోంది.ప్రతి రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్యపై ఏటా వేలకోట్ల రూపాయలు వెచ్చిస్తోంది. భూమి కేటాయింపు దగ్గరి నుంచి భవనాల నిర్మాణం, అధ్యాపకులూ ఇతర సిబ్బంది జీతభత్యాలు, నిర్వహణ ఖర్చులన్నింటినీ రాష్ట్రాలే భరిస్తున్నాయి. ఎలాంటి నిధులూ ఖర్చు చేయని కేంద్రం రాష్ట్ర విశ్వవిద్యాలయాలపై స్వారీ చేయాలనుకోవడం సరికాదు. రాష్ట్ర వర్సిటీలకు గ్రాంట్లను యూజీసీ మంజూరు చేయడం దాదాపు దశాబ్ద కాలంగా నిలిచిపోయింది. గతంలో మంజూరు చేసినవీ అరకొరే. దేశంలో అరవైకి లోపు ఉన్న కేంద్రీయ విశ్వవిద్యాలయాలకు మంజూరయ్యే నిధులు, దాదాపు ఆరు వందల రాష్ట్ర విశ్వవిద్యాలయాలకు దక్కుతున్న వాటికి సమానం. విద్యావేత్తలు దీనిపై ఎప్పటి నుంచో నిరసన గళం వినిపిస్తున్నారు. అయినా పట్టించుకొన్న నాథుడు లేడు. మరోవైపు విద్యార్థుల సంఖ్య, అందించే కోర్సులు, అధ్యాపకులు, సౌకర్యాల పరంగా చూసినా ఉన్నత విద్యలో రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలోని విశ్వవిద్యాలయాలే ముఖ్య భూమిక పోషిస్తున్నాయి. నూతన నిబంధనలు అమల్లోకి వస్తే వర్సిటీల విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలది కేవలం ప్రేక్షక పాత్రే అవుతుంది.

### రాజ్యాంగం ప్రకారం కుదరదు

కొత్త నిబంధనల ప్రకారం ఉపకులపతుల ఎంపికకు సెర్చ్ కమిటీ ఏర్పాటు నుంచి, నియామకం పూర్తయ్యే వరకు గవర్నర్లకే అధికారం ఉంటుంది. ఇప్పటికే తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాల్లో వైస్‌ఛాన్సలర్ల నియామక ప్రక్రియ స్తంభించిపోయింది. మిగిలిన ప్రతిపక్ష రాష్ట్ర ప్రభుత్వాలు ఏదో విధంగా నెట్టుకొస్తున్నాయి. వీటన్నింటి మూలంగా ఉన్నత విద్యావ్యవస్థ పూర్తిగా అచేతనంగా మారే ప్రమాదం ఉంది. లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుంది. రాజ్యాంగం పరంగా విశ్లేషిస్తే నూతన నిబంధనలను రాష్ట్రాలపై రుద్దే అవకాశం కేంద్రానికి లేదు. ఎందుకంటే, 42వ రాజ్యాంగ సవరణ తరవాత 'విద్య' ఉమ్మడి జాబితాలోకి వెళ్లింది. విద్య విషయంలో సమన్వయం, ప్రమాణాల స్థిరీకరణకే కేంద్రం అధికారం పరిమితం. అంతకు మించి మొత్తం పరిపాలనను, నియంత్రణాధికారాన్ని హస్తగతం చేసుకోవడం రాజ్యాంగ విరుద్ధం అవుతుంది. దీనిపై రాష్ట్రాలు సుప్రీంకోర్టు తలుపు తట్టే అవకాశం ఉంది. నూతన నిబంధనలపై అభిప్రాయ సేకరణకు కొంత గడువు ఉంది. విమర్శలు వెల్లువెత్తుతున్న దృష్ట్యా కొత్త ముసాయిదాపై యూజీసీ పునరాలోచించాలి.నూతన ముసాయిదాలో ఉపకులపతుల నియామకానికి సంబంధించిన అర్హతలూ చర్చకు దారితీస్తున్నాయి. సమర్థుడు, నిజాయితీపరుడు, నాయకత్వ లక్షణాలు కలిగిన 'విద్యావేత్త'ను ఉపకులపతిగా నియమించాలని ప్రస్తుత నిబంధనలు చెబుతున్నాయి. గొప్ప పరిశోధనల ద్వారా జాతికి మేలు చేకూర్చిన వారిని, సమాజసేవకు అంకితమైన వారినీ పరిగణనలోకి తీసుకోవచ్చు. నూతన ముసాయిదా ప్రకారం ఉన్నత విద్యారంగంతో ఏమాత్రం సంబంధం లేనివారినీ వైస్ ఛాన్సలర్లుగా నియమించే అవకాశం ఉంది. అంటే- విద్యావేత్తలు, పరిశోధకులతోపాటు పరిశ్రమల్లో సీనియర్ స్థాయిలో పనిచేసినవారు, ప్రభుత్వరంగ సంస్థల్లో విధులు నిర్వర్తించినవారూ ఆ పదవికి అర్హులే.

### వాటి సంగతేంటి?

నూతన ముసాయిదాలో ఉపకులపతుల పదవీకాలాన్ని అయిదేళ్లుగా పేర్కొన్నారు. ప్రస్తుతం కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో ఇది అమల్లో ఉంది. చాలా రాష్ట్రాల విశ్వవిద్యాలయాల్లో ఉపకులపతుల పదవీకాలం మూడు సంవత్సరాలే. వాస్తవానికి అయిదేళ్ల నియయం మంచి విషయమే. ఏవైనా సంస్కరణలను రూపొందించి అమలుచేసి, ఫలితాన్ని రాబట్టాలంటే ఆ మాత్రం కాలపరిమితి ఉండాల్సిందే.యూజీసీ నూతన నిబంధనలు కేంద్రీయ, రాష్ట్ర, డీమ్డ్, ప్రైవేటు విశ్వవిద్యాలయాలకు వర్తిస్తాయని పేర్కొన్నారు. దేశీయంగా దాదాపు 430దాకా ప్రైవేటు వర్సిటీలు వివిధ రకాల కోర్సులను అందిస్తున్నాయి. కొన్ని పథకాల కింద వాటికీ యూజీసీ నిధులు మంజూరు చేస్తోంది. ప్రైవేటు వర్సిటీలకు గవర్నర్లు ఛాన్సలర్లుగా వ్యవహరించడం లేదు. అలాంటప్పుడు నూతన నిబంధనలు వాటికి ఎలా వర్తిస్తాయని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఒకవైపు తీవ్ర విమర్శలు, మరోవైపు భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో నూతన ముసాయిదాపై యూజీసీ, కేంద్ర ప్రభుత్వం ఎలాంటి విజ్ఞతను ప్రదర్శిస్తాయో చూడాలి.

# మంచుకొండల్లో ఉంటారు.. కుంభమేళాకు మాత్రమే వస్తారు..



ప్రయాగ్‌రాజ్:రూపం దిగంబరం.. దేహమంతా విభూతి.. చేతిలో ఆయుధం.. జడలు కట్టిన శిరోజాలతో ఎర్రటికళ్లతో భయానకంగా ఉంటారు.. చీమకు కూడా అపకారం చేయరు. కానీ, ధర్మానికి అపచారం కలిగితే ప్రళయకాల రుద్రులవుతారు. ఎక్కడో హిమాలయాల్లో ఉంటారని వినడమే కానీ ప్రత్యక్షంగా చూసినవారు లేరు. పవిత్ర కుంభమేళా సమయాల్లో మాత్రమే వారు పవిత్ర స్నానాలకు వస్తారు. ఎంత నిశ్శబ్దంగా వస్తారో అంతే మౌనంగా వెళ్లిపోతుంటారు. వారే నాగ సాధువులు.

### ఎలా వచ్చింది ఈ సంప్రదాయం?

దీనిపై భిన్నమైన సిద్ధాంతాలున్నాయి. శంకర భగవత్పాదులు దేశంలోని నాలుగు దిక్కులా బదరీనాథ్, పూరి, ద్వారకా, శృంగేరిల్లో పీఠాలను ఏర్పాటు చేశారు. సనాతన ధర్మానికి పరిరక్షకులుగా ఈ సైన్యాన్ని ఏర్పాటు చేసినట్టు కొన్ని గ్రంథాలు పేర్కొంటున్నాయి. దీన్నే దశనామి సంప్రదాయంగా పరిగణిస్తున్నారు. శైవ, వైష్ణవ సంప్రదాయాలకు చెందిన అఖాడాల్లో నాగ సాధువులున్నారు. మొదట్లో యుద్ధవిద్యలో ప్రవీణులైనా ఆధునిక కాలంలో పూర్తిగా ఆధ్యాత్మిక జీవితం గడుపుతున్నారు. అయితే యుద్ధవిద్యల శిక్షణ మాత్రం కొనసాగుతోంది.

### ఎలా చేరాలి?

ఇది క్లిష్టతరమైన ప్రక్రియ. 'శంకరం శంకరాచార్యం కేశవం ' అని నినదిస్తారు. దీని అర్థం ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే . 'నాగ' అనే పదానికి భౌతికమైన వాంఛలను పరిత్యజించి ఎలాంటి బంధాలు లేని కఠోరమైన జీవితాన్ని ప్రారంభించాలనుకునేవారు ఇందులో చేరవచ్చు. సాధారణంగా కుంభమేళాల్లో కొత్తవారిని చేర్చుకుంటారు. అనేక వడపోత కార్యక్రమాల అనంతరం ఇందులో చేరేవారు శిరోముండనం చేసుకొని ఎవరికి వారే సొంతంగా పిండ ప్రదానం చేసుకోవాలి. దీంతో ఈ ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. మౌని అమవాస్యనాడు అమృతస్నానం చేస్తారు. ఏ అఖాడాలో చేరితే ఆ ఆచార్య మహామండలేశ్వరుడు తమ శాఖలోకి స్వీకరించే ప్రక్రియ చేపడతారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించేవారు అఖాడాలో ఎలా ఉండాలో వివరిస్తారు.

### వీళ్లు ఏం భుజిస్తారు..

పండ్లు, దుంపలు భుజిస్తారు. ఎక్కువకాలం ఉపవాసదీక్షలో ఉంటారు. ఇహలోక అంశాలతో వారికి ఎలాంటి సంబంధం ఉండదు. అందుకే రాగద్వేషాలకు అతీతంగా ఉంటారు.

### అఘోరాలకు వీరికి సంబంధం ఉందా?

లేదు.. అఘోరాలు వామాచారాలను పాటిస్తారు. నాగసాధువులు కుంభమేళాలకు మాత్రమే హాజరవుతారు. ఎంత దూరమైనా ఎలాంటి పాదరక్షలు లేకుండా విభూతిధారులై నడుస్తారు. కుంభమేళాకు హాజరయ్యే వీరిని దర్శించుకుంటే మంచిదని కోట్లాదిమంది భక్తుల విశ్వాసం

### అన్నింటిని అధిగమించి..

ఎముకలు కొరికే చలిలోనూ, నిప్పులు చెరిగే భానుడి తీవ్రతలోను వీరు చలించరు. యథాప్రకారం తమ నిత్య కార్యాలు నిర్వహిస్తుంటారు. వీరి సంఖ్య వేలల్లోనే ఉంటుంది. కుంభమేళాలు జరిగే తీర్థాలకు మాత్రమే వస్తారు. అనంతరం వెళ్లిపోతారు. ఎవరితోనూ సంబంధాలు ఉండవు. వందల సంవత్సరాలుగా ఇదే సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. ప్రపంచంలో ఏ దేశానికీ లేని ఆధ్యాత్మికత ఘనకీర్తి మనకు ఉంది. లోకకల్యాణం కోసం తరతరాల ఆచారాలను ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా పాటిస్తు దివ్యప్రభను అందిస్తున్న నాగసాధువులకు అనంత ప్రణామాలు చెప్పాల్సిందే.

# వైసిపిలో ఏం జరుగుతోంది..?

అమరావతి,వైసిపిలో ఏం జరుగుతోంది? తెలుగు రాష్ట్రాల్లో ఇప్పుడు ఇదే హాట్ టాపిక్. వైసిపి నుంచి రాజ్యసభ సభ్యులుగా ఉన్న మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్ రావు, ఆర్.కృష్ణయ్య, బాలినేని శ్రీనివాస్ రెడ్డి, ఆళ్ల నానీల తర్వాత ఇప్పుడు విజయసాయి రెడ్డి కూడా రాజీనామా చేశారు. ముందు ముగ్గురు రాజీనామాల్లో అంత ప్రత్యేకత ఏమీ లేకపోయినా స్వయం ప్రకటిత జగన్ ఆత్మఅయిన విజయసాయిరెడ్డి రాజీనామా ప్రత్యేకమైనది. జగన్‌కి మంచి జరగాలని కోరుకుంటున్నట్టు ట్వీట్ చేసిన ఆయన, జగన్ కష్టకాలంలో ఉన్నప్పుడు, అది కూడా జగన్ లండన్‌లో ఉన్న సమయంలో హ్యాండ్ ఇచ్చారు. ఇలా ముఖ్యనాయకులు బయటకు వెళ్లిపోవడం వల్ల వైఎస్‌ఆర్‌సిపి బలహీనపడుతుందా? కాకినాడ పోర్టు విషయంలో జరిగిన అక్రమాల కేసులో విజయసాయిరెడ్డి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. 'తిమింగలం తెలివిగా వల నుంచి తప్పించుకోవడానికే రాజీనామా చేసింద'ని క్షేత్రస్థాయిలో ప్రచారం జరుగుతోంది. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పదవులు అనుభవించి, కష్టకాలంలో విడిచిపోతున్నారని, 'పదవులూ ఆస్తులూ మీకూ, కేసులు మాకా?' అని కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. అయినా సరే, విజయసాయి రెడ్డి విషయంలో నాయకులనుంచి కార్యకర్తలవరకూ ఎవరూ సానుభూతి ప్రకటించడం లేదు.ఎవరూ రాజీనామా చేసినా పోతే పోనీ అన్నట్లుగానే వ్యవహారం ఉంది. వైఎస్‌ఆర్‌సిపి ఏర్పడి దాదాపు 12 ఏళ్లు కావొస్తున్నా.. ఆ పార్టీకి ఓటర్లు ఉన్నారు కానీ, సంస్థాగత నిర్మాణం సరిగా లేదు. 2024 ఎన్నికల్లో ఘోర పరాభవం తర్వాత కూడా అధినేత ఏకపక్ష నిర్ణయాలను మానుకోవడం లేదు. నాయకులు రాజీనామా చేసినప్పుడు సయోధ్య చేసే ప్రయత్నాలు కూడా చేయకపోవడం దీనికి నిదర్శనం. వైఎస్ షర్మిల మొదలుకొని, బాలినేని శ్రీనివాస్ రెడ్డి, విజయసాయి రెడ్డి లాంటి జగన్ ఆప్తులు బయటకెళ్లడం వల్ల వైఎస్‌ఆర్‌సిపి పనైపోయిందనుకోవడం అపోహ మాత్రమే. ఆప్తులు బయటకు వెళ్లడం వల్ల జగన్ నైతిక స్థైర్యం దెబ్బతింటుందేమోగానీ, పార్టీ దెబ్బతినే అవకాశం లేదు. ప్రాంతీయ పార్టీలు కష్టకాలంలో ఉన్నప్పుడు ఆ పార్టీ నుంచి రాజ్యసభ సభ్యులుగా ఉన్న నాయకులే ముసలం సృష్టించే ప్రయత్నం చేస్తారు.2019లో టిడిపి ఓడగానే ఆ పార్టీ రాజ్యసభ సభ్యులు సిఎం రమేష్, సుజనా చౌదరి, టిజి వెంకటేష్, గరికపాటి మోహన్ రావు రాజీనామా చేసి, బిజెపిలో చేరారు. వీరు కూడా చంద్రబాబు నాయుడికి అత్యంత సన్నిహితులుగా పేరుపొందినవారే. వీళ్లు పార్టీనుంచి వేరుపడటంవల్ల టిడిపికి కలిగిన నష్టం సున్నా. అప్పుడు చంద్రబాబు నాయుడి కుటుంబం విదేశాల్లో ఉన్నప్పుడే టిడిపి రాజ్యసభ సభ్యులు రాజీనామా చేసినట్లు, ఇప్పుడు జగన్ విదేశాల్లో ఉన్నప్పుడే సాయిరెడ్డి రాజీనామా చేయడం యాదృచ్ఛికమా? బిజెపి ప్లానా? అనే అనుమానాలు ఉన్నాయి. ఆంధ్ర రాష్ట్రాల్లో కర్మ ఏంటంటే%% అటు టిడిపి, ఇటు వైఎస్‌ఆర్‌సిపి కేసుల్లో చిక్కుకోవడంవల్ల బిజెపి ప్రాంతీయ పార్టీల భుజం మీద తుపాకీపెట్టి కాలుస్తోంది. 2019 నుంచి 2024 మధ్య వైసిపి భుజం మీద తుపాకీ పెట్టి టిడిపిని కూల్చాలని ప్రయత్నించిన బిజెపి, ఇప్పుడు టిడిపి భుజం మీద తుపాకీ పెట్టి వైఎస్‌ఆర్‌సిపిని కూల్చే ప్రయత్నం చేస్తోందని చర్చించుకుంటున్నారు.కానీ, బిజెపి, టిడిపి కలిసి వైఎస్‌ఆర్‌సిపిని అంతం చేయడం కల్లగానే భావించాలి. మాయల ఫకీర్ ప్రాణం పక్షిలో ఉన్నట్టు%% వైఎస్‌ఆర్‌సిపి భవిష్యత్తు కాంగ్రెస్ మీదే ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం వైఎస్‌ఆర్‌సిపి ఓటర్లంతా కాంగ్రెస్ ఓటర్లే.కాంగ్రెస్ పార్టీకి గతంలో బలంగా మద్దతిచ్చిన ఎస్‌సి మాల, ముస్లింలు, రెడ్లు, కాపులు, క్రిస్టియన్లు,



బ్రాహ్మణులే%% ఇప్పుడు వైఎస్‌ఆర్‌సిపి ప్రధాన ఓటర్లుగా ఉన్నారు. వీళ్లు ఎప్పుడూ టిడిపికి, దానితో కూటమికట్టే పార్టీలకు వ్యతిరేకంగానే ఉంటారు. మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్. రాజశేఖరరెడ్డి అకాల మరణం, తెలంగాణ ఉద్యమం కలిసి ఆంధ్రాలో కాంగ్రెస్‌ని పాతాళంలోకి తొక్కాయి. 2014 నాటికి నోటాతో పోటీపడే స్థాయికి పరిస్థితి దిగజారింది. 2014లో నందిగామ ఎన్నికలో వైఎస్‌ఆర్‌సిపికి 46.9 శాతం ఓట్లు రాగా, కాంగ్రెస్‌కి 1.3 శాతం ఓట్లు వచ్చాయి. అక్కడి నుంచి గెలిచిన టిడిపి అభ్యర్థి తంగిరాల ప్రభాకర్ రావు మరణించడంతో వెంటనే ఉప ఎన్నిక వచ్చింది. ఆ ఉప ఎన్నికలో వైఎస్‌ఆర్‌సిపి పోటీనుంచి తప్పుకోవడంతో వైఎస్‌ఆర్‌సిపి ఓట్లు బదిలీ అయ్యి 19.5% ఓట్లతో కాంగ్రెస్ రెండో స్థానంలో నిలిచింది. 2015లో తిరుపతిలో జరిగిన ఉప ఎన్నికలో కూడా వైఎస్‌ఆర్‌సిపి పోటీనుంచి తప్పుకోవడంతో ఆ ఓట్లన్ని కాంగ్రెస్‌కి బదిలీ అయ్యాయి.2014 ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్‌ఆర్‌సిపికి 44.6% ఓట్లు రాగా, కాంగ్రెస్ కేవలం 2.8 శాతానికే పరిమితమయ్యింది. విభజన తర్వాత కాంగ్రెస్ బలం, బలగం అంతా కాంగ్రెస్ నుంచి జగన్ పెట్టిన వైఎస్‌ఆర్‌సిపికి బదిలీ అయ్యాయని చెప్పడానికి ఇవే నిదర్శనాలు. కాబట్టి, ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ పెరిగినప్పుడు మాత్రమే జగన్ ఆందోళన చెందాలి గానీ, విజయసాయిరెడ్డి లాంటి నాయకులు వెళ్లిపోయినప్పుడు కాదు. ఆర్థిక వనరులు సమకూర్చేవారు, లాబీయింగ్ చేసేవారు ఏ పార్టీకయినా అవసరమే. కానీ వాళ్లను తెర వెనుకకే పరిమితం చేయాలి తప్ప బడా లీడర్లుగా ప్రమోట్ చేయొద్దు. అధ్యక్షుడు అందర్నీ సంప్రదించి నిర్ణయాలు తీసుకుంటున్నారు అనే భావన కలిగించడం వల్ల క్షేత్రస్థాయిలో పార్టీ బలపడుతుంది.ఏనాడు ప్రత్యక్ష ఎన్నికల్లో గెలవని సాయి రెడ్డి వల్ల ఒక్క ఓటు కూడా రాదు. ఆయన ఒక అవినీతిపరుడు అనేది మిడిల్ క్లాస్ ప్రజల్లో ఒక అభిప్రాయంగా ఉంది. ప్రజల్లో సానుకూల ఇమేజ్ తెచ్చుకోవాలని సాయిరెడ్డి ఏనాడూ ప్రయత్నించలేదు. సాయిరెడ్డితో పాటు కొడలి నాని, అంబటి రాంబాబు, రోజా, జోగి రమేశ్ వంటి నాయకుల దిగజారుడు భాషతో పార్టీకి నష్టం జరిగింది. అజాత శత్రువుగా గుర్తింపు పొందిన అశోక్ గజపతిని వేధించిన తీరును కూడా ప్రజలు అసహ్యించుకున్నారు. సాయిరెడ్డి నిష్క్రమణ వైఎస్‌ఆర్‌సిపి పట్ల ప్రజల్లో ఉన్న ప్రతికూలతను కొంత తగ్గించేందుకు ఉపయోగపడుతుంది. కార్పొరేట్ కంపెనీగా కాకుండా ఒక రాజకీయ పార్టీగా వ్యవహారాలు సాగించాలని, ఈ ఉదంతం నిరూపించింది. 40% ఓటు బ్యాంకు ఉన్న పార్టీని ఎంతమంది వీడిపోయినా అది టీ కప్పులో తుఫాన్ మాత్రమే.

# విజయసాయి ఐదేళ్ల కాలం...విశాఖకు ఓ పీడకల లాంటిది

విశాఖపట్నం,విజయ్ సాయి రెడ్డి ఉన్న ఐదేళ్లు.. విశాఖ ప్రజలకు ఒక పీడకల అంటూ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వ్యాఖ్యలు చేశారు. విజయసాయి రెడ్డి రాజకీయాల నుంచి తప్పుకోవడంపై ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్పందించారు. మీడియాతో మాట్లాడుతూ.. ఆయన కన్ను పడిన భూములు వారికి దాకాల్సిందే అని అన్నారు. తన భూములే చాలా వరకు ఉన్నాయని.. బెదిరించి తీసుకుని వారి కుటుంబాల పేరు మీద మార్పించుకున్నారని ఆరోపించారు. వైజాగ్ ఫైల్స్ పేరుతో గతంలో ఆ వివరాలను బయటపెట్టామన్నారు. విశాఖలో అనేక మందిని బెదిరించి కూల్చివేతలు చేశారని.. భూములు ఆక్రమించుకున్నారని తెలిపారు. రాష్ట్రంలో జగన్ అక్రమాలు చేస్తే, విశాఖలో అంతకుమించి అరాచకాలు చేశారన్నారు. ఆయన ట్వీట్ చూస్తుంటే జాలి, నవ్వు, ఆశ్చర్యం వస్తుందన్నారు. ఆయన ద్వారా నష్టపోయిన వారికి ఎవరు న్యాయం చేస్తారని ప్రశ్నించారు. సాయి రెడ్డి విశాఖలో చేసిన పనులను ప్రజలు మర్చిపోరని అన్నారు. చేసిన తప్పులన్నింటికీ చట్టాపరంగా చర్యలు ఉంటాయని.. తప్పించుకోలేరని.. బాధ్యులవుతారు అనుభవించాల్సి వస్తుందని స్పష్టం చేశారు. వైసీపీ మునుగుతున్న పడవ అని... చివరికి జగన్ తప్పితే ఎవరూ మిగలరంటూ కామెంట్స్ చేశారు. జగన్‌కు నీడ లాంటి వ్యక్తి భాగస్వామి.. రాజీనామా చేసి బయటకు వెళ్తున్నారంటే పరిస్థితి ఏంటో అర్థం అవుతుందన్నారు. త్వరలోనే అయోధ్య రామయ్య మన జిల్లా నుంచి కూడా ఒక రాజ్యసభ సభ్యుడు రాజీనామా చేస్తున్నారని తెలిపారు. వైసీపీ తాజా పరిస్థితికి విజయసాయిరెడ్డి రాజీనామా ఒక ఉదాహరణగా చెప్పుకొచ్చారు. చివరికి జగన్ ఏకాకిగా మిగిలిపోతారన్నారు. పార్టీ పరిస్థితి ఇలా తయారవ్వడానికి జగన్మోహన్ రెడ్డి ఆటిట్యూడ్ కారణమన్నారు. వైసీపీ నిజ స్వరూపం బయటపడిందని.. స్టీల్ ఎ÷-లాంట్ ప్యాకేజీ విషయంలో వైసీపీ కళ్ళుండి చూడలేని కబోతుల్లాగా వ్యవహరిస్తున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఐదేళ్లలో స్టీల్ ఎ÷-లాంట్ విషయంలో వైసీపీ ఏం చేసిందో చెప్పాలన్నారు. దావోస్ పర్యటనలో చంద్రబాబు, లోకేష్ పెట్టబడులాకర్షించే ప్రయత్నం చేశారని తెలిపారు. విశాఖకు గూగుల్, టీసీఎస్, సంస్థలు మరిన్ని సంస్థలు వస్తున్నాయన్నారు. గతంలో ఏపీకి రావాలంటే భయపడే పరిస్థితి ఉందని.. మళ్లీ బ్రాండ్ క్రియేట్ చేస్తున్నామని తెలిపారు.

# కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తీవ్ర విమర్శలు

అమరావతి, రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి చేసిన ప్రకటన ఏపీ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. విజయసాయి నిర్ణయంపై కూటమి నాయకులు ఒక్కొక్కరుగా స్పందిస్తున్నారు. విజయసాయిని వదిలిపెట్టబోమని హెచ్చరిస్తున్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఎన్నో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపిస్తున్నారు. విజయసాయిరెడ్డిని వదిలే ప్రసక్తే లేదని టీడీపీ నాయకులు వార్నింగ్ ఇస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ షాకింగ్ కామెంట్స్ చేశారు. వైసీపీపై కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తీవ్ర విమర్శలు గుప్పించారు. వైసీపీ నుంచి విజయసాయి రెడ్డి బయటకు రావడంలో ఎలాంటి ఆశ్చర్యం లేదని అన్నారు. శనివారం నాడు ఏలూరులో పట్టాభిరామ్ పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో పట్టాభిరామ్ మాట్లాడారు. జగన్ మోహన్ రెడ్డి చేసిన ప్రతీ క్రైమ్‌లో విజయ సాయి రెడ్డికి వాటా ఉందని సంచలన ఆరోపణలు చేశారు. విజయ సాయి రెడ్డికి వ్యవసాయం చేసుకోవాలనే కోరిక జైల్లో తప్పక నెరవేరుస్తామని పట్టాభిరామ్ హామీ ఇచ్చారు. జైల్లో కూడా ఖైదీలకు వ్యవసాయం చేసుకునే అవకాశం ఉంటుందని అన్నారు. విజయసాయిరెడ్డి కూడా జైలుకు పోతారని.. ఆయన శేష జీవితంలో జైల్లో వ్యవసాయం చేసుకునే అవకాశం కల్పిస్తామని పట్టాభిరామ్ షాకింగ్ కామెంట్స్ చేశారు. వైసీపీ పార్టీలో కేవలం జగన్ మోహన్ రెడ్డి, భారతీ మాత్రమే మిగులుతారని విమర్శలు చేశారు. జగన్ మోహన్ రెడ్డి కూడా త్వరలోనే జైలుకెళ్లడానికి సిద్ధంగా ఉండాలని పట్టాభిరామ్ హెచ్చరించారు. కేసుల నుంచి తప్పించుకోడానికి మాత్రమే విజయసాయిరెడ్డి రాజీనామా డ్రామా ఆడుతున్నారని ఆరోపించారు. తాము ఎవరిని వదిలిపెట్టబోమని కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మాస్ వార్నింగ్ ఇచ్చారు.

# కసరత్తు...

అమరావతి, రాష్ట్రంలో ప్రాథమిక సహకార సొసైటీలు, వ్యవసాయ మార్కెట్ కమిటీలకు పాలక వర్గాల నియామకంపై ముమ్మరంగా కసరత్తు జరుగుతోంది. సంక్రాంతిలోపే ఈ నియామకాలు పూర్తవుతాయని పార్టీ వర్గాలు ఆశించినా అనుకోని కారణాలతో ఆ ప్రక్రియ పూర్తి కాలేదు. ఈ నెలాఖరుకు ఇవి వెలువడవచ్చని టీడీపీ కేంద్ర కార్యాలయ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రంలో సహకార సొసైటీల పాలకవర్గాల పదవీకాలం కొన్ని సంవత్సరాల క్రితమే పూర్తయింది. వైసీపీ ప్రభుత్వం వీటికి ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ పాలక వర్గాలతో నడిపించింది. వీటిలో కొన్ని సంస్కరణలు చేపట్టాలన్న యోచనలో ఉన్న కూటమి ప్రభుత్వం కూడా ప్రస్తుతానికి వీటికి నామినేటెడ్ పాలక మండళ్లు నియమించాలని నిర్ణయించింది. ప్రతి సొసైటీకి ముగ్గురు సభ్యుల పాలక మండలిని నియమిస్తారు. ఇందులో ఒకరు చైర్మన్‌గా ఉంటారు. రాష్ట్రంలో వ్యవసాయ సహకార ప్రాథమిక సొసైటీలు 2,200 ఉన్నాయి. ఇవిగాక మత్స్యకార సొసైటీలు, చేనేత సొసైటీలు వంటి వాటికి కూడా పాలక మండళ్లను నియమించాల్సి ఉంది. వీటికి ఎగువన జిల్లా స్థాయిలో జిల్లా సహకార కేంద్ర బ్యాంక్, జిల్లా మార్కెటింగ్ సొసైటీలు, రాష్ట్ర స్థాయిలో రాష్ట్ర సహకార బ్యాంక్ వంటి వాటికి కూడా పాలకవర్గాలను నియమించాల్సి ఉంది. గ్రామ స్థాయిలో నియమించాల్సిన వాటిపై ప్రతిపాదనలు పంపాలని ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జులకు పార్టీ నాయకత్వం ఆదేశాలు జారీ చేసింది.ఈ పదవుల్లో 80 శాతం టీడీపీ, 15 శాతం జనసేన, 5 శాతం బీజేపీకి ఇవ్వాలని ప్రాథమికంగా నిర్ణయించారు. అధిక శాతం ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు ఇప్పటికే ఈ పేర్లు పంపారు. వీటిపై పార్టీ కేంద్ర కార్యాలయం పరిశీలన జరుపుతోంది. పార్టీ కార్యాలయం పరిశీలన పూర్తయితే ఈ నియామకాలపై జీవోలు వెలువడే అవకాశం ఉంది. ఈ నియామకాల కోసం కింది స్థాయిలో పార్టీ నేతలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కింది స్థాయిలో నియామకాలు పూర్తయిన తర్వాత జిల్లా, రాష్ట్ర స్థాయి సహకార సంస్థల పాలక మండళ్లు నియమిస్తారు. వీటికి ఇప్పటికే ఆశావహులు ముమ్మరంగా లాబీయింగ్ చేస్తున్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీల పాలక మండళ్ల నియామకానికి కూడా ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 600 మార్కెట్ కమిటీలకు పాలక మండళ్లను నియమించాల్సి ఉంది. వీటికి అధ్యక్షుడు, మరి కొందరు డైరెక్టర్లు ఉంటారు. ఈ నియామకాల్లో రిజర్వేషన్ అమలు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఏ మార్కెట్ కమిటీ ఏ రిజర్వేషన్ పరిధిలోకి వస్తుందో ఇప్పటికే ఖరారు చేశారు. దానికి అనుగుణంగా పేర్లు పంపాలని ఎమ్మెల్యేలకు కేంద్ర కార్యాలయం సూచించింది. కొందరు ఎమ్మెల్యేలు ఇప్పటికే పంపారు. మిగిలిన వాటి కోసం కేంద్ర కార్యాలయంలో ఎదురు చూస్తోంది. ఈ ప్రతిపాదనలు అందిన తర్వాత వాటిపై కూడా పార్టీపరంగా పరిశీలన జరుపుతారు. ఆ తర్వాత నియామక ఉత్తర్వులు వెలువడుతాయి. ఫిబ్రవరి మొదటి వారంలో వీటి నియామకాలు జరిగే అవకాశం ఉంది.

# గోడ దూకేందుకు సిద్ధం ..

హైదరాబాద్,తెలంగాణ రాజకీయాల్లో ఏ నేత ఎప్పుడూ ఏ పార్టీలో ఉంటారో తెలియని పరిస్థితి. ఈరోజు ఈ పార్టీలో ఉన్న నేత మరో రోజు మరో పార్టీ కండువాతో కనిపిస్తున్నారు. అధికారమే పరమావధిగా భావిస్తుండడంతో ప్రతిపక్షాలకు చెందిన పార్టీలు తమ నాయకులను కాపాడుకునేందుకు ఆపసోపాలు పడాల్సి వస్తోంది.తెలంగాణ ఆవిర్భావం తర్వాత మొదటి 10 ఏళ్లు అధికారాన్ని అనుభవించిన భారతీయ రాష్ట్ర సమితి ప్రతిపక్షాలు లేకుండా చేయాలన్న లక్ష్యంతో పనిచేసింది. ప్రతిపక్ష పార్టీలకు చెందిన నేతలను తమ పార్టీలో చేర్చుకునేందుకు సామ, దాన, భేద, దండోపాయాలను ప్రయోగించింది. ఒకానొక సమయంలో తెలంగాణలో ప్రజాపక్షంగా నిలబడి వాయిస్ వినిపించే బలమైన నాయకులు లేకుండా పోయారు. అయితే రాజకీయాలు ఎల్లప్పుడూ ఒకే విధంగా ఉండవు. కాలం మారింది.రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయింది.ఇప్పుడు తమ పార్టీకి చెందిన నేతలను కాపాడుకోవాల్సిన స్థితికి బిఆర్ఎస్ చేరిపోయింది. గడిచిన ఎన్నికల్లో గెలిచిన ఎంతోమంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ గూటికి చేరిపోయారు. ఉన్న కీలక నేతలను కాపాడుకునేందుకు కేసిఆర్, ఆయన కుమారుడు కేటీఆర్ సర్వశక్తులూ వడ్డాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎప్పుడు ఏ నేత పార్టీ మారుతారో తెలియక వారంతా ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలోనే మరో కీలక నేత పార్టీ మారతారన్న చర్చ జోరుగా సాగుతోంది. బీఆర్ఎస్‌లో కీలక నేత, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ గోడ దూకేందుకు సిద్ధపడుతున్నారు అన్న వార్తలు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.బిఆర్ఎస్ అంతర్గత చర్చల్లోనూ ప్రస్తుతం ఇదే టాపిక్ నడుస్తున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్ నగర పరిధిలోని సనత్‌నగర్ నియోజకవర్గ నుంచి వరుసగా విజయాలు దక్కించుకుంటూ వస్తున్న ఆయన భారతీయ రాష్ట్ర సమితి హయాంలో మంత్రిగానూ చక్రం తిప్పారు. బిఆర్ఎస్ అధికారం కోల్పోయిన తర్వాత తలసాని పెద్దగా యాక్టివ్ పాలిటిక్స్ లో కనిపించడం లేదు. దీంతో తలసాని పార్టీ మారుతారు అన్న ఊహాగానాలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి.వాస్తవానికి కేటీఆర్ పై ఫార్ములా ఈ రేస్ కేసులు నమోదైనప్పుడు

## ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల దోపిడీ

హైదరాబాద్, తెలంగాణలో ప్రైవేటు స్కూళ్లలో ఫీజుల నియంత్రణపై ముసాయిదా బిల్లు సిద్ధమైంది. ఈ మేరకు ముసాయిదా బిల్లును విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళీ రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించారు. ఫీజుల నియంత్రణ కమిషన్ ఏర్పాటుకు విద్యా కమిషన్ సిఫార్సు చేసినట్టు సమాచారం. ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ట్యూషన్ ఫీజులు తల్లిదండ్రులను బెంబేలెత్తిస్తున్నాయి. ప్రభుత్వ నియంత్రణ లేకపోవడం, యాజమాన్యాలు ఏటా సగటున 10-15 శాతం పెంచుకుంటూ పోతుండటంతో ప్రధానంగా చిరుద్యోగులు, మధ్య తరగతి కుటుంబాలకు పెను భారంగా మారాయి. జీవో 91 ప్రకారం కలెక్టర్లు ఛైర్మన్‌గా ఉండే జిల్లా ఫీజుల నియంత్రణ కమిటీ (డీఎఫ్ఆర్‌సీ)లకు నియంత్రించే అధికారం ఉందని గతంలో భావించే వారు. అయితే డీఎఫ్ఆర్‌సీలకు ఆ అధికారం లేదని, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని కమిటీలకు మాత్రమే అధికారం ఉంటుందని సుప్రీంకోర్టు 2016 సెప్టెంబరు 19న తీర్పునిచ్చింది. ఈ నేపథ్యంలో ఫీజుల నియంత్రణపై రాష్ట్ర ప్రభుత్వం ముసాయిదా బిల్లు తయారీ బాధ్యతను విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళికి అప్పగించింది. ఇంజినీరింగ్, ఇతర వృత్తి విద్యా కోర్సులకు టీఏఎఫ్ఆర్‌సీ ఉన్నట్లుగానే రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకు రాష్ట్రస్థాయిలో ఒక కమిటీని నియమించాలని, దానికి హైకోర్టు విశ్రాంత జడ్జి ఛైర్మన్‌గా ఉండేలా ప్రభుత్వానికి సిపారసు చేయాలని తెలంగాణ విద్యా కమిషన్‌కు హైదరాబాద్ స్కూల్స్ పేరెంట్స్ అసోసియేషన్(హెచ్ఎస్‌పీఏ) విన్నవించింది. ఈ మేరకు సంఘం సంయుక్త కార్యదర్శి వెంకట్, ఇతర ప్రతినిధులు ఇటీవల కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి, సభ్యుడు ఆచార్య పీఎల్ విశ్వేశ్వర్‌రావులకు వినతిపత్రం అందజేశారు. ప్రతి సంవత్సరం ఫీజులను పెంచుకోవడం కాకుండా ఇంజినీరింగ్ కళాశాలల తరహాలో మూడేళ్లకోసారి ఆడిట్ నివేదికలను పరిశీలించి మాత్రమే పెంపును నిర్ణయించాలని కోరారు. సమస్యలను పరిష్కరించేందుకు గ్రీవెన్స్ విభాగాన్ని కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా 2009 నుంచి ఫీజుల నియంత్రణపై వచ్చిన జీవోలు, ఆదేశాలు, హైకోర్టు కార్యకలాపాలు తదితర వాటితో కూడిన పుస్తకాన్ని అందజేశారు.

## మళ్లీ షాక్ ఇస్తారా?

న్యూఢిల్లీ, ఇంతకీ నితీశ్‌కుమార్ ఎన్డీఏతోనే ఉంటారా? మళ్లీ ఇండియా కూటమిలోకి వెళతారా? బీహార్ అసెంబ్లీ ఎన్నికల నాటికి ఆయన ఏ కూటమిలో ఉంటారో తెలియని పరిస్థితి. ఇంతకీ నితీశ్‌కుమార్ ఎన్డీఏతోనే ఉంటారా? మళ్లీ ఇండియా కూటమిలోకి వెళతారా? బీహార్ అసెంబ్లీ ఎన్నికల నాటికి ఆయన ఏ కూటమిలో ఉంటారో తెలియని పరిస్థితి. మణిపూర్‌లో బీజేపీ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకుంటున్నట్టు ప్రకటించిన జేడీయూ.. కాసేపటికే యూటర్న్ తీసుకుంది. తాము తాము ఎన్డీఏలోనే ఉన్నామని స్పష్టం చేసింది. దీంతో నితీష్ మీద మరోసారి అనుమానాలు మొదలయ్యాయి. బీహార్ రాజకీయాల్లో ఎప్పుడు ఏమైనా జరగవచ్చు అంటున్నారు విశ్లేషకులు. జనతాదళ్ యునైటెడ్ పార్టీ నుంచి వెలువడిన ప్రకటనతో దేశ రాజకీయాలు మరోసారి ఆసక్తిగా మారాయి. అంతలోనే అంతా ఉత్తదేనని ఆ పార్టీ యూ టర్న్ తీసుకుంది.. గత అనుభవాల దృష్ట్యా బీజేపీ శ్రేణులు జేడీయూను మరోసారి అనుమానంగా చూడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దీనంతటికీ కారణం తమ జేడీయూ మణిపూర్ విభాగం.. ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో బీజేపీ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకుంటున్నట్టు ఆ రాష్ట్రానికి చెందిన జేడీయూ అధ్యక్షుడు క్షేత్రమయుం బీరేన్ సింగ్ అధికారిక ప్రకటన విడుదల చేశారు. జేడీయూ ఏకైక ఎమ్మెల్యే అబ్దుల్ నాసిర్ ఇక నుంచి ప్రతిపక్షంలో కూర్చుంటారని తెలిపారు. ఈ ప్రకటనతో భాజపాతో ఆ పార్టీ పొత్తుపై కొద్దిసేపు ఉత్కంఠ నెలకొంది. ఈ ఏడాది బీహార్ అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో రెండు పార్టీలకు ఎక్కడ చెడిందనే చర్చ మొదలైంది. అయితే కొద్ది గంటల్లో జేడీయూ జాతీయ నాయకత్వం స్పందించింది. ఆ వార్తల్లో ఎంతమాత్రం నిజం లేదని జేడీయూ జాతీయ ప్రతినిధి రాజీవ్ రంజన్ ప్రసాద్ వివరణ ఇచ్చారు. పార్టీ జాతీయ నాయకత్వాన్ని సంప్రదించకుండా మణిపూర్ జేడీయూ రాష్ట్ర విభాగం అధ్యక్షుడు క్షేత్రమయుం బీరేన్ సింగ్ సొంతంగా ప్రకటన చేసినట్టు చెప్పారు. బీరేన్‌సింగ్‌ను క్రమశిక్షణారాహిత్యం కింద పదవి నుంచి తొలగించినట్టు వెల్లడించారు. మణిపూర్ అసెంబ్లీకి 2022లో జరిగిన ఎన్నికల్లో జేడీయూ 6 స్థానాలను గెలుచుకుంది, అయితే ఎన్నికలు ముగిసిన నెలల తర్వాత ఆ పార్టీకి చెందిన ఐదుగురు ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి ఎన్.బీరేన్ సింగ్ సారథ్యంలోని BJPకి మారారు. 60 మంది సభ్యుల అసెంబ్లీలో ప్రస్తుతం బీజేపీకి 37 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. దీనికి నాగా పీపుల్స్ ఫ్రంట్‌కు చెందిన ఐదుగురు ఎమ్మెల్యేలు, ముగ్గురు స్వతంత్రులు మద్దతుగా నిలిచారు. మణిపూర్‌లో గత రెండేళ్లుగా జరుగుతున్న హింసాత్మక ఘటనల నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎన్.బీరేన్ సింగ్ ప్రభుత్వం మీద ప్రజా వ్యతిరేకత పెరిగింది. మణిపూర్‌లో మైతీలు, కుకీల మధ్య జాతి హింస కొనసాగుతున్న నేపథ్యంలో కాన్రాడ్ సంగ్మాకు చెందని నేషనల్ పీపుల్స్ పార్టీ అక్కడి ప్రభుత్వానికి తన మద్దతును ఉపసంహరించుకుంది. మరో మిత్రపక్షం – కుకీ పీపుల్స్ అలయన్స్ – ఎన్‌డిఎ నుండి వైదొలిగింది. తాజాగా జేడీయూ కూడా మద్దతు ఉపసంహరించుకోవడం కొంత సంచలనం సృష్టించినా, అదేమీ లేదని ఆ పార్టీ కేంద్ర నాయకత్వం స్పష్టం చేసింది. ఒకవేళ జేడీయూ మద్దతు ఉపసంహరించుకున్నా మణిపూర్ బీజేపీ ప్రభుత్వానికి వచ్చే ముప్పు ఏమీ లేదు. ప్రస్తుతానికి తాము బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమిలోనే ఉన్నామని జేడీయూ జాతీయ నాయకత్వం స్పష్టమైన వివరణ ఇచ్చినా అనుమానాలు మాత్రం కొనసాగుతూ ఉన్నాయి. ఇటు బీహార్‌లోనూ, అటు కేంద్రంలోని ఎన్డీయేలోనూ జేడీయూ భాగస్వామిగా ఉంది. దీనికితోడు బీహార్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు కూడా జరగాల్సి ఉన్నాయి. ఈ నేపథ్యంలో మణిపూర్‌లోని బీజేపీ సర్కార్‌కు జేడీయూ మద్దతు ఉపసంహరించుకందంటూ ఆ పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు ప్రకటించడం సంచలనమైంది. జేడీయూ అధినేత, బీహార్ ముఖ్యమంత్రి నితీష కుమార్ నిలకడ లేని రాజకీయాలు మరోసారి తెర మీదకు వచ్చాయి. ఆయన పార్టీకి సొంతంగా మెజారిటీ లేకున్నా కొంత కాలం బీజేపీతోనూ, మరికొంత కాలం లాలూ ప్రసాద్ నేతృత్వంలోని ఆర్జేడీతోనూ పొత్తు పెట్టుకొని ముఖ్యమంత్రి పదవిలో కొనసాగుతున్నారు. అటు ఎన్డీఏ, ఇటు ఇండియా కూటముల మధ్య దోబూచులాట ఆడుతున్నారు. నితీష్ కుమార్ నాయకత్వంలోని జేడీయూ 2013లో తొలిసారిగా నరేంద్ర మోదీ ప్రధాని అయిన తర్వాత బీజేపీతో జేడీయూ పొత్తును తెంచుకొని ఎన్డీఏ కూటమి నుంచి బయటకు వచ్చింది. ఈ నిర్ణయం మతతత్వానికి వ్యతిరేకంగా పోరాటం అని ప్రకటించుకున్నారాయన. ఆ తర్వాత లాలూ ప్రసాద్ ఆర్జేడీ, కాంగ్రెస్‌కు దగ్గరయ్యారు.. 2017లో ఆర్జేడీ, కాంగ్రెస్‌తో దోస్తీకి గుడ్‌బై చెప్పి మరోసారి బీజేపీతో చేతులు కలిపారు నితీష్ కుమార్. బీజేపీ, జేడీయూ కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి నితీశ్ కుమార్ ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు. ఆగస్టు 2022లో జేడీయూ మరోసారి బీజేపీతో పొత్తును తెంచుకుంది. నితీష్ కుమార్ దీనిని బీజేపీ కుట్ర, ఒత్తిడి రాజకీయం అని అభివర్ణించారు. దీని తర్వాత జేడీయూ ఆర్జేడీ, కాంగ్రెస్ తదితర పార్టీలతో కలిసి మహాకూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. కొద్ది కాలానికే మళ్లీ నితీష్ కుమార్ మళ్లీ ఎన్డీఏలోకి వచ్చారు. జాతీయ స్థాయిలో కొత్తగా ఏర్పడ్డ విపక్ష ఇండియా కూటమి నాయకత్వ బాధ్యతలు దక్కక పోవడమే కారణమని అంటారు విశ్లేషకులు. ఎన్డీఏలోకి తిరిగి వచ్చిన నితీష్ కుమార్ తాను బీజేపీతో ఎప్పటికీ స్నేహాన్ని వీడబోనని ప్రకటించారు.

## దండకారణ్యంలో రాలిపోతున్న నక్సలైట్స్...

హైదరాబాద్,దండకారణ్యం దద్దరిల్లితోంది. నిత్యం తుపాకీ మోతలతో నెత్తురోడుతోంది.. పైన డ్రోన్ల సాయంతో మావోయిస్టులున్న ప్రాంతాన్ని గుర్తించి భద్రతా దళాలు ఫోకస్ చేస్తున్నాయి. ఈ క్రమంలో నక్సల్స్, పోలీసు బలగాల మధ్య ఎదురు కాల్పులు జరుగుతున్నాయి. ఈ ఎదురు కాల్పుల్లో ఎందరో మావోయిస్టులు ప్రాణాలు కోల్పోతున్నారు. వయోభారంతో ఉన్న మావోయిస్టు అగ్రనేతలను లక్ష్యంగా భద్రతా బలగాలు ముందుకు పోతున్నాయి. ఒకవైపు ఏరివేత.. మరోవైపు లొంగిపోవాలన్న ప్రభుత్వం పిలుపుతో వృద్ధాప్యంలో ఉన్న మావోయిస్టులు సైతం అడవులకే పరిమితం అవుతున్నారని తెలుస్తోంది.

దండకారణ్యం కేంద్రంగా

దండకారణ్యం అటవీ ప్రాంతం నాలుగు రాష్ట్రాలకు విస్తరించి ఉంది. తెలంగాణ, ఛత్తీస్‌గడ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో విస్తరించి ఉంది. ఇందులో ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లాల్లో ఒకటైన బీజాపూర్ జిల్లా అబూజ్‌మడ్ అడవులు దట్టంగా ఉంటాయి. ఎత్తైన కొండలు కూడా. ఇవి శత్రుదుర్భేద్యంగా ఉంటాయని భావించి మావోయిస్టులు దీన్ని కేంద్రంగా చేసుకొని కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా ఎత్తైన కొండల నుంచి సుమారు పది కిలోమీటర్ల దూరంలో ఉన్న శత్రువులను కూడా బైనాక్యులర్స్ ద్వారా గుర్తించే అవకాశాలు ఉంటాయి. దంతెవాడ, నారాయణ్‌పుర్, బీజాపుర్ జిల్లాల్లో దాదాపు నాలుగు వేల ఎకరాల్లో అబూజ్‌మడ్ అడవులు విస్తరించి ఉన్నాయి. ఇక్కడికి రావడం భద్రతా బలగాలకు సాధ్యం కాదని, మావోయిస్టు అగ్రనేతలు తలదాచుకుంటారనే ప్రచారం ఉంది. అబూజ్‌మడ్ అడవుల్లో కీలక నాయకులు ఉండి ఉద్యమాన్ని నడిపిస్తున్నారని నిఘావర్గాలు అనుమానించి హెచ్చరించాయి. అక్కడే ఆయుధ తయారీ, శిక్షణ, సమావేశాలు జరుగుతుంటాయని నిఘా వర్గాలు గుర్తించాయి. అలాగే ప్రతి అగ్రనేతకు నాలుగు అంచెల భద్రతా కూడా ఉంటాయి.

కేంద్ర-రాష్ట్ర బలగాలు నిరంతర నిఘా..

దేశంలో వామపక్ష తీవ్రవాదాన్ని తుదముట్టిస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అనేకమార్లు ప్రకటించారు. 2026 మార్చికి నక్సల్స్ రహిత భారత్ లక్ష్యంగా కేంద్రం పెట్టుకుంది. అలాగే ఛత్తీస్‌గడ్ రాష్ట్రంలో మావోయిస్టు కార్యకలాపాలు పెరిగిపోయాయి. దాదాపు బస్తర్ జిల్లాల్లో మావోయిస్టుల ఆధీనంలోకి వెళ్లిపోయింది. దీంతో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని రంగంలోకి దిగింది. కేంద్ర-రాష్ట్ర బలగాలు ఉమ్మడి ప్రణాళికతో ముందుకు వెళ్లి వామపక్ష తీవ్రవాదాన్ని తుది ముట్టించడానికి సిద్ధమయ్యాయి. అందులో భాగంగా దండకారణ్యం చుట్టూ కేంద్ర బలగాల క్యాంపెయిన్ ఏర్పాటు చేసింది. ప్రతి 20 కిలోమీటర్లకు ఒక క్యాంప్ ఏర్పాటు చేసిన మావోయిస్టుల ఏరివేతకు శ్రీకారం చుట్టింది. అటు కేంద్ర బలగాలు, రాష్ట్ర పోలీసులు సంయుక్తంగా చొచ్చుకుపోతున్నాయి. లోపల ఉన్న మావోయిస్టులెవరూ బయటకురాకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశాయి. డ్రోన్లతోనూ నిరంతరం నిఘా కొనసాగిస్తున్నారు. నేషనల్ టెక్నికల్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఎన్టీఆర్వో) ద్వారా అమ్యాన్డ్ ఏరియల్ వెహికిల్(యూఏవీ)లను కూడా వినియోగిస్తూ ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని క్షేత్రస్థాయిలో ఉన్న బలగాలకు చేరవేస్తున్నారు. కీలకమైన ప్రాంతాల్లో రాత్రిపూట కూడా నిఘా పెట్టే డ్రోన్లను వాడుతున్నారు. మావోయిస్టులు మందుపాతరలు పెట్టి ఉంటారని అనుమానిస్తును బలగాలు అత్యాధునిక బాంబు నిర్వీర్య దళాలను రంగంలోకి దింపాయి. ఇలా ముప్పెట దాడి చేసి మావోయిస్టులను మ



ట్టుబెడుతున్నాయి.

కీలకనేతలను కాపాడుకోవడమే మావోయిస్టులకు పెద్ద సవాల్

మావోయిస్టు పార్టీలో కొత్త రిక్రూట్‌మెంట్ లేకపోవడంతో ఉన్న కీలక నేతలందరూ వృద్ధాప్యంతో బాధపడుతున్నారన్న సమాచారం నిఘా వర్గాల వద్ద ఉన్నాయి. సాధారణంగా కేంద్ర కమిటీ సభ్యులకు నాలుగు అంచెల భద్రతా ఉంటుంది. అయితే కొత్తతరం లేకపోవడంతో కీలకనేతల భద్రత కూడా వారి ఒక సమస్యగా ఉందని తెలుస్తోంది. ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన కేంద్ర కమిటీ సభ్యుడు చలపతి కూడా వృద్ధాప్యం సమస్యతో బాధపడుతూ తూటలకు బలైనట్లు సమాచారం. మావోయిస్టు పార్టీ రథసారథి నంబాళ్ల కేశవరావు, మాజీ కార్యదర్శి ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి, మల్లోజుల వేణుగోపాల్ 70 ఏళ్లకు పైబడ్డ వారే..! మిగతా వారిలో కదారి సత్యనారాయణరెడ్డి, మోడెం బాలకృష్ణ, తెంటూ లక్ష్మీనర్సింహాచలం, పుల్లూరి ప్రసాదరావు కూడా అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారని సమాచారం. ఈ పరిస్థితుల్లో ఓ వైపు కేంద్ర బలగాలను ఎదుర్కోవడం.. మరోవైపు అగ్రనేతలను కాపాడుకోవడం మావోయిస్టు పార్టీకి పెద్ద సవాల్‌గా మారింది. మల్లోజుల కోటేశ్వరరావు భార్య పోతుల కల్పన కేంద్ర కమిటీ సభ్యుల్లో ఏకైక మహిళ. ఆమె జనతన సర్కార్ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. అడపాదడపా పోలీసుల వ్యూహాలను తిప్పికొడుతున్న కేంద్ర కమిటీ సభ్యుల్లో తిప్పిరి తిరుపతి, గాజర్ల రవి, కట్టా రామచంద్రారెడ్డి, బడే దామోదర్ అలియాస్ చొక్కారావు, పసునూరి నరహరి ఉన్నారు.

మావోయిస్టు పార్టీకి కీలక సమయం ఇదే!

ఒక వైపు మావోయిస్టు పార్టీ అగ్రనేతలను కాపాడుకోవడం.. మరో వైపు ముప్పెట దాడి చేస్తున్న కేంద్ర, రాష్ట్రాల బలగాలను ఎదుర్కోవడం ఆ పార్టీకి పెద్ద సవాల్‌గా మారింది. గత ఏడాది 267 మంది వరకూ కోల్పోయిన మావోయిస్టు పార్టీ ఈ ఏడాది ఆరు ఎన్‌కౌంటర్లలో సుమారు 50 మంది వరకు కోల్పోయింది. మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక కేంద్ర కమిటీ సభ్యుడు చలపతిరావును కోల్పోవడం ఆ పార్టీకి తీరని లోటు. ఎన్‌కౌంటర్‌లో ఒక కేంద్ర కమిటీ సభ్యుడిని కోల్పోవడం ఇదే ప్రథమం. కొత్త రిక్రూట్ లేకపోవడంతో, మరోవైపు ఉన్న క్యాడర్ పోలీసు తూటలకు బలి అవడంతో మావోయిస్టు పార్టీ మనుగడ ప్రశ్నార్థకమైంది. తుది శ్వాసలో మావోయిస్టు పార్టీ ఉందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. డ్రోన్, అత్యాధునిక సాయంతో బలగాలు ముందుకు వెళుతున్న ఈ తరుణంలో మావోయిస్టు పార్టీకి కీలక సమయంగా ఉంటుందని పలువురు భావిస్తున్నారు.

## భూ భారతి చట్టం అమలులో జాప్యం.. ప్రభుత్వంలో అసలేం జరుగుతోంది?




హైదరాబాద్,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పినట్లుగానే ధరణిని బంగాళఖాతంలో వేశారు కానీభూ భారతిని మాత్రం సకాలంలో అమలులోకి తీసుకురాలేక పోయారు. డిసెంబర్ 18వ తేదీన అసెంబ్లీలో, 20వ తేదీన మండలిలో ఏకగ్రీవంగా ఆమోదించిన చట్టాన్ని కారణం ఏమిటో కానీ ప్రభుత్వం డిసెంబర్ 31వ తేదీన గవర్నర్‌కు పంపింది. అసెంబ్లీ ఉభయ సభలు ఆమోదించిన చట్టాన్ని పరిశీలించిన గవర్నర్ 2025 జనవరి 9వ తేదీన ఆమోదించి, రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. ఆ తరువాత గెజిట్ విడుదలైంది. ఇది జరిగి రెండు వారాలు కావస్తున్నా రూల్స్‌ను సర్కారు ఇంత వరకు విడుదల చేయలేక పోయింది. అసలు నోటిఫై తేదీని ఇప్పట్లో ప్రకటిస్తారా? అన్న సందేహాలు కూడా వెలువడుతున్నాయి.

సిద్ధం కానీ సర్వర్

భూ భారతి పోర్టల్ అమలుకు సర్వర్ సిద్ధం కాలేదని తెలుస్తోంది. దీంతో ప్రస్తుతం భూమి రికార్డులు, క్రయ విక్రయాలన్నీ ధరణి పోర్టల్‌లోనే నడుస్తున్నాయి. దీంతో భూ భారతి చట్టంతో వచ్చిన మార్పు ఏమిటన్నది రైతులకు తెలియని పరిస్థితి. కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉండగా ధరణి అక్రమాలపై పోరాటం చేసింది. ధరణిలో జరిగిన అక్రమాలే ఆయుధంగా చేసుకున్న కాంగ్రెస్ పార్టీ రైతు డిక్లరేషన్ ప్రకటించింది. తమ పార్టీ అధికారంలోకి రాగానే ధరణిని బంగాళాఖాతంలో వేస్తామని పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్ రెడ్డి ప్రకటించారు. నమ్మిన ప్రజలు గెలిపించారు. కానీ భూ భారతి చట్టం తీసుకురావడానికి కాంగ్రెస్ పార్టీకి ఏడాది దాటిన తరువాతే సాధ్యమైంది. చట్టం అయితే తీసుకొచ్చారు కానీ నేటికి ధరణి పోర్టల్‌నే అమలులో ఉంచారు.

చట్టం తేవడానికి ముందే నాడు సిద్ధమైన ధరణి

ధరణి చట్టం తీసుకొచ్చే నాటికి గత బీఆరెస్ ప్రభుత్వ ధరణి పోర్టల్‌ను, సర్వర్‌ను సిద్ధం చేసుకున్నది. ఆ తరువాతనే చట్టాన్ని అమలులోకి తెచ్చింది. ధరణి చట్టం రావడానికి కొద్ది రోజుల ముందు రికార్డులన్నింటినీ ఫ్రీజ్ చేసింది. అయితే ధరణికి మందు కేంద్రప్రభుత్వ రంగ సంస్థ అయిన ఎన్ఐసీ చేతిలో వెబ్‌సైట్ నిర్వహణ ఉండేది. రికార్డులు పక్కాగా ఉండేవి. కానీ గత టీఆర్ఎస్ ప్రభుత్వం ధరణిని తీసుకు వచ్చి వెబ్ సైట్ నిర్వహణను ఎన్ఐసీ నుంచి తీసి వేసి ప్రైవేట్ సంస్థ చేతికి అప్పగించింది. అయితే ధరణి చట్టం అమలుకు మూడున్నరేళ్లుగా రూల్స్ తీసుకురాకుండా అమలు చేసింది. దీంతో ధరణిలో అనేక సమస్యలు వచ్చాయి. సమస్యల పరిష్కారానికి వేదిక లేకుండా పోయింది. దీంతో ధరణిలో భూమి రికార్డుల నిర్వహణ, సమస్యల పరిష్కారం అంతా గందర గోళంగా మారింది. ధరణి సమస్యలపైనే కాంగ్రెస్ ఫోకస్ చేసింది. ధరణి చట్టంతో భూములన్నీ కాజేశారని ఆరోపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఏడాది తరువాత భూ భారతి చట్టాన్ని తీసుకు వచ్చింది. బిల్లును చట్ట రూపంలో తీసుకు రావడానికి ముందుగా ప్రజల ముందుకు తీసుకు వెళ్లారు. దీనిని అభినందించాల్సిందే. అయితే కాంగ్రెస్ పార్టీ చట్టం తీసుకు వచ్చిన వెంటనే తీసుకు రావాల్సిన రూల్స్‌కు ఇప్పటి వరకు అతిగతీ లేదు. కనీసం దీనిపై కసరత్తు జరుగుతుందా అన్న సందేహాలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. వాస్తవంగా రూల్స్ లేకుండా చట్టాన్ని అమలు చేయడం సాధ్యం కాదు.భూ భారతి చట్టాన్ని అమలు చేయాలంటే రూల్స్ రావాలి. వాటికి అనుగుణంగా సాఫ్ట్ వేర్‌లో తగిన మార్పులు చేయాలి. కానీ ఆదిశగా ప్రయత్నాలు జరుగడం లేదన్న సందేహాలు సర్వత్రా వెలువడుతున్నాయి. ఉన్న వెబ్ సైట్‌నే వీరు సక్రమంగా నిర్వహించడం లేదు. ఫలితంగా స్లాట్ బుకింగ్‌కు గంటల తరబడి వెయిట్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నదని ఒక రైతు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారినికి దరఖాస్తు చేసుకోవడానికి వీలు పడడం లేదని అంటున్నారు. దీనిపై రైతులు రెవెన్యూ సిబ్బందిని ఏదైనా దరఖాస్తు పరిష్కరించమని అడిగితే కొత్త చట్టం వచ్చాక చేద్దామని సమాధానం చెప్పుతున్నారని రైతులు పేర్కొంటున్నారు. కొత్త చట్టం అమలులోకి తీసుకు వచ్చే వరకు అన్ని యథాతథంగా కొనసాగుతాయని చెప్పారు కానీ అమలు కావడం లేదని, రైతులు ఇబ్బంది పడుతున్నాని రైతుల సమస్యలపై పని చేస్తున్న వారు చెపుతున్నారు. దీంతో అసెంబ్లీలో చట్టం చేస్తున్న సందర్భంగానే కొత్త చట్టం అమలులోకి వచ్చే వరకు అన్ని స్టాప్ చేయాలని సీసీఎల్ ఏ సర్క్యులర్ ఇచ్చినట్లు ప్రచారం జరిగింది. వెంటనే దీనిని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఖండించారు. అలాంటి సర్క్యులర్ ఇవ్వలేదని స్పష్టం చేశారు.కానీ రెవెన్యూ అధికారులు ధరఖాస్తులు పరిష్కరించకుండా కొత్త చట్టం వచ్చిన తరువాతనే చేస్తామని చెప్పుతున్న దానిని బట్టి నిజంగానే రెవెన్యూ శాఖ సర్క్యులర్ ఇచ్చిందా? అన్న సందేహాలను రైతు సంఘాల నేతలు వ్యక్తం చేస్తున్నారు. కారణాలు ఏవైనా ధరణి స్థానంలో భూ భారతి పోర్టల్ తీసుకు రావడంలో ఆలస్యం అవుతున్నది. దీనికి శాఖ మంత్రి కారణమా? అధికారులది కారణమా? అంటే శాఖకు బాస్ అయిన మంత్రినే బాధ్యత వహించాల్సి ఉంటుందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. వాస్తవంగా ధరణి పోర్టల్ స్థానంలో భూ భారతి చట్టం, భూ భారతి పోర్టల్ అమలులోకి రావాలంటే మూడు రకాల పనులను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని న్యాయనిపుణులు చెపుతున్నారు. ఇందులో మొదటగా వెను వెంటనే భూ భారతి నియమాలు, రూల్స్‌ను రూపొందించి అమలులోకి తీసుకు రావాలి. రూల్స్ అమలుకు తగిన విధంగా సాఫ్ట్ వేర్‌లో మార్పులు చేయాలి. భూ భారతి చట్టాన్ని ఏ తేదీ నుంచి అమలు చేస్తారో నోటిఫై చేయాలి. ఈ మేరకు అన్ని రూపొందించి చట్టాన్ని అమలులోకి తీసుకు రావడానికి సీసీఎల్ ఏ కార్యాలయంలో వార్ రూమ్‌ను ఏర్పాటు చేసుకొని ఫుట్ వార్ బేస్‌లో అమలు చేయాల్సి ఉంటుందని న్యాయనిపుణులు చెపుతున్నారు.ఇలాంటి వార్ రూమ్‌లో సాఫ్ట్ వేర్ నిపుణులు, రెవెన్యూ అధికారులు, లీగల్ ఎక్స్ ఫర్ట్స్‌తో ఏర్పాటు చేసి పని చేస్తే త్వరగా చట్టం అమలులోకి రావడానికి అవకాశం ఉంటుందని అంటున్నారు. అలాగే వార్ రూమ్‌లో తీసుకున్న నిర్ణయాలు అప్పటికప్పుడే అమలు చేసే విధంగా తగిని సిబ్బందిని కూడా ఏర్పాటు చేసుకోవాలని పేర్కొంటున్నారు. ఒక వైపు రూల్స్‌ను అమలులోకి తీసుకు రావడంతో పాటు కొత్త చట్టం అమలుపై ప్రజలకు అవగాహన కల్పించాలని స్పష్టం చేస్తున్నారు. రెవెన్యూ అధికారులకు, సిబ్బందికి పూర్తి స్థాయిలో శిక్షణ ఇవ్వాలని, అప్పుడే రైతులకు ఇబ్బందులు కలుగకుండా భూమాత చట్టంలో సేవలు అందించడానికి వీలవుతుందని చెబుతున్నారు. ఈ దిశగా కాంగ్రెస్ సర్కారు ఎందుకు ప్రయత్నాలు చేయడం లేదన్న చర్చ రెవెన్యూ వర్గాలలో జరుగుతోంది.

## పార్కులు,ప్రభుత్వ స్థలాల కబ్జాలపై ఫిర్యాదులు

హైదరాబాద్,హైదరాబాద్ అమీన్‌పూర్ మున్సిపాలిటీలో సమగ్ర సర్వేకు హైడ్రా సిద్ధమైంది. రహదారులు, పార్కులు, ప్రభుత్వ స్థలాల కబ్జాలపై హైడ్రా అధికారులకు ఫిర్యాదులు వచ్చాయి. అమీన్‌పూర్ మున్సిపాలిటీలో ఆక్రమణలపై నిగ్గు తేల్చే పనిలో హైడ్రా అధికారులు ఉన్నారు. తమ కాలనీలోని పార్కులు, రహదారులతో పాటు కొన్ని ఎ÷-లాట్లను పక్కనే ఉన్న గోల్డెన్ కీ వెంచర్స్ వారు ఆక్రమించారంటూ హైడ్రాకు వెంకటరమణ కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. సర్వే నెంబర్ 152, 153లో ఉన్న వెంకటరమణ కాలనీలో హైడ్రా అధికారులు సర్వే చేశారు. పార్కులు, రహదారులు కబ్జాకు గురైనట్లుగా నిర్ధారణకు హైడ్రా అధికారులు వచ్చారు. వెంకటరమణ కాలనీలోకి చొరబడి గో÷-డలెన్ కీ వెంచర్స్ ఆక్రమణలకు పాల్పడినట్లు ప్రాథమిక నిర్ధారణ చేశారు. ఈ విషయంలో మరింత లోతైన సర్వే చేయించేందుకు హైడ్రా అధికారులు చర్యలు చేపట్టారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ సర్వే ఆఫ్ ఇండియా , ఏడీ సర్వే సంయుక్త ఆధ్వర్యంలో జాయింట్ సర్వే చేసేందుకు హైడ్రా అధికారులు ప్రయత్నం చేశారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీలోని వెంకటరమణ కాలనీకి ఆనుకుని పలు కాలనీల నుంచి కూడా హైడ్రాకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఇలా ఫిర్యాదులు అందిన నేపథ్యంలో సమగ్ర సర్వే చేసేందుకు హైడ్రా అధికారులు సిద్ధమయ్యారు. అందరి సమక్షంలో పారదర్శకంగా జరిగే ఈ సర్వేలో భాగస్వామ్యం కావాలని హైడ్రా అధికారులు కోరారు. హైడ్రా సర్వే అంటూ చుట్టుపక్కల ఉన్న కాలనీ వాసులను గో÷-డలెన్ కీ వెంచర్స్ నిర్వాహకులతో పాటు.. పలువురు ఆక్రమణదారులు తప్పుదోవ పట్టిస్తున్నారు. వారి ఆక్రమణలు కప్పి పుచ్చుకోడానికి చేస్తున్న ప్రయత్నాలకు ఎవరూ బలి కావద్దని హైడ్రా అధికారులు సూచించారు. ఇప్పటికే పలు ఆరోపణల నేపథ్యంలో గో÷-డలెన్ కీ వెంచర్స్ ఆస్తులను ఎన్‌ఫోర్సుమెంట్ డైరెక్టరేట్(ఈడీ) అటాచ్ చేసిన విషయం విధితమే. అమీన్‌పూర్ మున్సిపాలిటీలోని ఆర్టీసీ కాలనీ, రంగారావు వెంచర్, చక్రపురి కాలనీ వాసులు కూడా ఏమైనా కబ్జాలుంటే ఫిర్యాదు చేయాలని.. ఈ సమగ్ర సర్వేలో వారిని కూడా భాగస్వామ్యం చేస్తామని హైడ్రా అధికారులు చెప్పారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీలోని కాలనీ వాసులు ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదని.. ఏమైనా ఫిర్యాదులుంటే హైడ్రా కార్యాలయానికి వచ్చి నేరుగా ఫిర్యాదు చేయాలని హైడ్రా అధికారులు సూచించారు.

## బడ్జెట్‌కు చకచకా ఏర్పాటు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టబోయే కేంద్ర బ్జడెట్‌కు సంబంధించిన పనులు తుది దశకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా ఏటా నిర్వహించే హల్వా వేడుకను నార్త్ బ్లాక్‌లో శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ వేడుకలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో పాటు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. బడ్జెట్ తయారీ పక్రియలో పాల్గొన్న అధికారులకు, సిబ్బందికి హల్వాను నిర్మలా సీతారామన్ స్వయంగా పంచిపెట్టారు. కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి, ఉన్నతాధికారులు తుహిన్‌కాంత్ పాండే, అజయ్ సేథ్ తదితరులు ఈ వేడుకలో పాలుపంచుకున్నారు. నిర్మలా సీతారామన్ బ్జడెట్ ప్రవేశపెట్టడం ఇది వరుసగా ఎనిమిదోసారి. ఓ వైపు జీడీపీ వృద్ధి మందగించిన వేళ (6.4 శాతం నమోదు కావొచ్చని అంచనా) 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఆమె బడ్జెట్ ప్రతిపాదించనున్నారు. ఈ సారి కూడా డిజిటల్ రూపంలోనే బ్జడెట్ ప్రవేశపెట్టనున్నారు. గడిచిన నాలుగు బడ్జెట్లుగా ఇదే పద్ధతిని అనురిస్తున్నారు. బ్జడెట్ తయారీలో ప్రత్యక్షంగా పాల్గొనే అధికారులు, సిబ్బంది - పార్లమెంట్‌లో దానిని ప్రవేశపెట్టేవరకు ఆ నార్త్ బ్లాక్‌లోనే ఉంటారు. వారు బయటకు వెళ్లడానికి వీలుండదు. వారు ఎల్లప్పుడూ సీసీటీవీ కెమెరాలు, భద్రతా సిబ్బంది నిఘాలో ఉంటారు. కనీసం వారు ఫోన్ చేయడానికి కూడా వీలుండదు. ఒకసారి పార్లమెంట్‌లో నిర్మలా సీతారామన్ బ్జడెట్ ప్రసంగం పూర్తయిన తర్వాతే వీరు బయటకు వస్తారు. అంటే దాదాపు మరో వారం రోజుల పాటు వీరికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు ఉండవన్నమాట. 1950లో బ్జడెట్లోని ముద్రణ పక్రియ కొనసాగుతున్న సమయంలో లీక్ అవ్వడంతో ఈ లాక్-ఇన్ నిర్ణయం తీసుకున్నారు.

## వలసదారులపై కొరడా

వాషింగ్టన్, తాను అధికారంలోకి వస్తే అక్రమ వలసదారులను సొంత దేశాలకు పంపిస్తానని, ఇందుకోసం అమెరికా చరిత్రలోనే అతిపెద్ద కార్యక్రమాన్ని చేపడతానని డొనాల్డ్ ట్రంప్ హామీ ఇచ్చినట్టుగానే ఇప్పుడు పని మొదలుపెట్టారు. మూడు రోజుల్లోనే అమెరికా అధికారులు 538 మంది అక్రమ వలసదారులను అరెస్టు చేశారని, వందలాది మంది సైనిక విమానాల్లో దేశం నుంచి పంపించేశారని వైట్ హౌజ్ ప్రెస్ సెక్రటరీ కరోలీన్ లీవిట్ తెలిపారు. అరెస్టు చేసిన అక్రమ వలసదారులు అనేక నేరాలకు పాల్పడ్డారని ఆమె చెప్పారు.

పార్ట్‌టైమ్‌కు రాంగ్ టైమ్

వలసదారులపై కఠినంగా వ్యవహరిస్తున్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీరు అమెరికాలోని భారతీయ విద్యార్థులను తీవ్ర కలవరపాటుకు గురి చేస్తున్నది. చదువుకుంటూ క్యాంపస్ బయట పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేసుకునే విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా క్యాంపస్ బయట పని చేస్తూ అధికారులకు దొరికితే దేశం నుంచి పంపిస్తారని భయపడుతున్నారు. ఎఫ్-1(స్టూడెంట్) వీసాపై అమెరికాకు ప్రతియేటా లక్షలాది మంది భారతీయ విద్యార్థులు వస్తున్నారు. ఇందుకోసం తల్లిదండ్రులు దాదాపు రూ.30-40 లక్షలు ఖర్చు చేస్తున్నారు. అమెరికా వచ్చిన తర్వాత విద్యార్థులు తమ జీవనవ్యయం కోసం చదువుకుంటూ, ఏదో ఓ పార్ట్‌టైమ్ ఉద్యోగం చేస్తుంటారు. అయితే, నిబంధనల ప్రకారం విద్యార్థులు యూనివర్సిటీ క్యాంపస్‌లోనే పార్ట్‌టైమ్ ఉద్యోగం చేయాలి. అది కూడా వారానికి 20 గంటలకు మించి పని చేయొద్దు.

ఉద్యోగాలు వదులుకుంటున్న విద్యార్థులు

క్యాంపస్‌లో పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చాలా తక్కువ సంఖ్యలో ఉంటాయి. పైగా వారానికి 20 గంటలే పని చేస్తే ఖర్చులకు డబ్బులు సరిపోవు. దీంతో విద్యార్థులు క్యాంపస్ బయట రోజుకు 6-8 గంటల పాటు పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేస్తున్నారు. ట్రంప్ రాకతో పని ప్రదేశాల్లో అధికారులు తనిఖీలు చేపడతారని, క్యాంపస్ బయట పని చేస్తూ దొరికితే దేశం నుంచి పంపిస్తారని భయపడుతున్నారు. 'కొత్త నిబంధనను ఇమిగ్రేషన్ అధికారులు కఠినంగా అమలు చేస్తారని విని ఉద్యోగం మానేశాను. రిస్క్ తీసుకోలేను' అని ఇలినాయిా యూనివర్సిటీ విద్యార్థి ఒకరు వాపోయారు. 'కొన్ని నెలలు పరిస్థితిని పరిశీలించిన తర్వాతే పార్ట్‌టైమ్‌లోకి చేరతాం. అప్పటివరకు అప్పు చేయడమో, తల్లిదండ్రులను డబ్బులు అడగడమో తప్పదు' అని న్యూయార్క్‌లో మాస్టర్స్ చేస్తున్న మరో విద్యార్థి చెప్పారు.బహిర్గతం కానున్న కెనడీ హత్య రహస్యాలుఅమెరికా మాజీ అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెనడీ హత్యకు సంబంధించిన రహస్యాలు బయటకు రానున్నాయి. ఆయనతో పాటు పౌర హక్కులకై పోరాడిన నాయకుడు మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్, సెనేటర్ రాబర్ట్ ఎఫ్ కెనడీ హత్యలకు సంబంధించి ఇంతకాలం రహస్యంగా ఉన్న ఫైళు బహిర్గతం కానున్నాయి. ఈ మేరకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కార్యనిర్వాహక ఆదేశాన్ని జారీ చేశారు. ఫైళ్లను బయటపెట్టేందుకు 15 రోజుల్లో ప్రణాళికను సమర్పించాలని డైరెక్టర్ ఆఫ్ నేషనల్ ఇంటెలిజెన్స్‌ను ఆదేశించారు.

# వైసీపీలో విజయసాయిరెడ్డి స్థానం ఎవరికి?



అమరావతి,వైసీపీలో కీలక నేత విజయసాయిరెడ్డి రాజకీయాల నుంచి వైదొలగడంతో ఆయన స్థానంలో ఎవరు? అన్న ప్రశ్న పార్టీలో ఎక్కువగా వినిపిస్తోంది. పార్టీ ఆవిర్భావం నుంచి ఢిల్లీ స్థాయిలో వ్యవహారాలు నడపడంలో విజయసాయిరెడ్డి పాత్ర ఎనలేనిది. ముఖ్యంగా గత ఐదేళ్లు కేంద్రం నుంచి అన్నివిధాలుగా సహాయ సహకారాలు పొందడంలో విజయసాయిరెడ్డి సక్సెస్ అయ్యారంటారు. దీంతో ఆయన స్థానాన్ని ఎవరికి అప్పగిస్తారని అంతా చర్చించుకుంటున్నారు.వైసీపీలో ఎందరో కీలక నేతలు ఉన్నారు. కానీ, పార్టీ పరమైన ముఖ్యమైన పనులను అధినేత జగన్ కొందరికే అప్పగిస్తారు. అలాంటి వారిలో విజయసాయిరెడ్డితోపాటు వైవీ సుబ్బారెడ్డి, సజ్జల రామక్రిష్ణారెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్ రెడ్డి, అవినాశ్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కరరెడ్డి వంటివారు ముందుంటారు. రాష్ట్రాన్ని ఐదు ప్రాంతాలుగా విభజించి ఒక్కో చోట ఒక్కొక్కరిని ఇన్ చార్జిగా నియమిస్తుంటారు. అదేవిధంగా ఢిల్లీ పనుల కోసం ఒకరిని వినియోగించుకుంటారు.గత ఐదేళ్లలో ఢిల్లీ స్థాయిలో అన్ని పనులను విజయసాయిరెడ్డే చక్కబెట్టేవారు. ఇక ఉత్తరాంధ్రతోపాటు ప్రకాశం, నెల్లూరు జిల్లాల ఇన్చార్జిగానూ ఆయన పనిచేశారు. ఉత్తరాంధ్ర నుంచి తప్పిస్తే అంతే కీలకమైన ప్రకాశం, నెల్లూరు జిల్లాలను విజయసాయికి అప్పగించడం ఆయన పాత్రను సూచిస్తుంది. అయితే ఇప్పుడు ఆయన రాజకీయాల నుంచే తప్పుకోవడంతో విజయసాయి రెడ్డి స్థానాన్ని భర్తీ చేసే నేత ఎవరన్న ప్రశ్న ఎక్కువగా వినిపిస్తోంది.వైసీపీకి ప్రస్తుతం 11 మంది ఎమ్మెల్యేలు, నలుగురు ఎంపీలు ఉన్నారు. వీరిలో జగన్ మినహాయిస్తే మిగిలిన పది మందిలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తప్ప మిగిలిన వారు ఎవరూ పెద్ద స్థాయిలో వ్యవహారాలు చక్కబెట్టే నైపుణ్యం, ఓర్పు, సామర్థ్యం లేవనే టాక్ ఆ పార్టీలో వినిపిస్తోంది. దీంతో ఎంపీల్లో మిథున్ రెడ్డి, అవినాశ్ రెడ్డిపైనే ఎక్కువగా భారం పడుతోంది. కేసుల వల్ల అవినాశ్ రెడ్డికి కీలక బాధ్యతలు అప్పగించే విషయంలో జగన్ ఒకటికి రెండు సార్లు ఆలోచిస్తున్నారని చెబుతున్నారు. దీంతో తన సన్నిహితుడు, స్నేహితుడు మిథున్ రెడ్డిపైనే జగన్ ఆధారపడతారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి మిథున్ రెడ్డి నమ్మిన బంటు. ఇద్దరూ చిన్ననాటి స్నేహితులు. జగన్ ఏ పని అప్పగించినా మిథున్ రెడ్డి చిత్తశుద్ధితో పూర్తి చేస్తారనే నమ్మకం ఉంది. ఇక గత ఎన్నికల్లో రాష్ట్రం మొత్తం వైసీపీ తుడిచిపెట్టుకుపోయినా, మిథున్ రెడ్డితో సహా ఆయన తండ్రి, బాబాయ్ టీడీపీ హవాను తట్టుకుని గెలవగలిగారు. దీంతో ప్రస్తుత విపత్కర పరిస్థితులను మిథున్ రెడ్డి మాత్రమే అధిగమించగలరని ఆ పార్టీలో ఎక్కువ మంది అభిప్రాయపడుతున్నారు. విజయసాయిరెడ్డి స్థానాన్ని మిథున్ తో భర్తీ చేస్తే బాగుంటందని సూచిస్తున్నారు. మరి మాజీ సీఎం జగన్ ఆలోచన ఎలా ఉంటుందోనని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# కేడర్‌కు పవన్ ఓపెన్ లెటర్.. సైలెన్స్ ప్లీజ్

అమరావతి,ఏపీలో వైసీపీ తన ప్లాన్ అమలు చేస్తోందా? కూటమి మధ్య విభేదాలకు వైసీపీ శ్రీకారం చుట్టిందా? జనసేన కేడర్‌ను వైసీపీ రెచ్చగొట్టే ప్రయత్నంలో పడిందా? ఎందుకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ కార్యకర్తలకు ఓపెన్ లెటర్ రాశారు? పార్టీలో పరిణామాలు అటువైపు దారితీస్తున్నాయా? అవుననే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి.ఏపీలో కూటమి ప్రభుత్వం ఏడాది కూడా పూర్తి కాలేదు. వైసీపీ తన పనిలో నిమగ్న మైంది. ప్రతీ అవకాశాన్ని వినియోగించుకుంటోంది. సోషల్ మీడియా ద్వారా నేరుగా ప్రభుత్వంపై దాడి చేయకుండా కూటమిలో చీలిక తెచ్చేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. టీడీపీ కార్యకర్తలు.. జనసేన కార్యకర్తలను రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెడుతోంది. దీంతో జనసైనికులు ఓవర్‌గా రియాక్ట్ అవుతున్నారు. కొద్దిరోజులు ఈ తతంగం నడుస్తోంది.జనసేన హైకమాండ్‌కు దీనిపై సంకేతాలు వెళ్లాయి. దీంతో రంగంలోకి దిగేశారు డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్. ఈ క్రమంలో కేడర్‌కు ఓపెన్ లెటర్ రాశారా యన. కూటమి అంతర్గత విషయాల్లో ప్రతిస్పందించొద్దన్నది ప్రధాన పాయింట్. అనవ సర వివాదాలు, విభేదాల జోలికి వెళ్లొద్దన్నది మరో సూచన. సామాజిక మాధ్యమాల్లో వచ్చే తప్పుడు వార్తలపై సెలెంట్‌గా ఉండాలని ప్రస్తావించారు.అలాగే వ్యక్తిగత విషయాలు వెల్లడించి, బహిరంగంగా చర్చించొద్దని శ్రేణులకు పిలుపు ఇచ్చారు. తాను పదవుల కోసం ఏనాడూ రాజకీయం చేయలేదు.. భవిష్యత్ చేయనని మనసులోని మాట బయట పెట్టారు. పుట్టిన నేలను అభివృద్ధి చేయడం మాత్రమే తనకు తెలుసన్నారు. ఈ విషయంలో కూటమి ప్రభుత్వాన్ని అర్థం చేసుకుని ముందుకు సాగాలని రిక్వెస్ట్ చేశారు.అలాగే మార్చి సెకండ్ వీక్ జనసేన పార్టీ ఆవిర్భావం రోజు భవిష్యత్ లక్ష్యాలు గురించి చర్చించుకుందామని రాసుకొచ్చారు. గడిచిన



ఐదేళ్ల వైసీపీలో ప్రజలు విసిగిపోయారని, మొన్నటి ఎన్నికల్లో ఎన్డీయే ఘన విజయం సాధించిందన్నారు. ప్రజలు సుస్థిరమైన ప్రభుత్వాన్ని, నాయకత్వాన్ని ఎన్నుకున్నారని గుర్తు చేశారు.అభివృద్ధిని గాడిలో పెట్టేందుకు అనుభవం కలిగిన నాయకులు కలిసి రావడంతో కూటమికి 164 సీట్లు ఇచ్చిన విషయాన్ని ప్రధానంగా గుర్తు చేశారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు వార్తలపై ఎట్టి పరిస్థితుల్లోనూ స్పందించవద్దని విజ్ఞప్తి చేశారు. ప్రతీ ఒక్కరూ ఈ విషయాన్ని గ్రహించి కూటమి ఔన్నత్యాన్ని అర్థం చేసుకుని ముందుకు సాగాలని కోరుకుంటున్నట్లు చెప్పుకొచ్చారు.రీసెంట్‌గా దావోస్ టూర్‌కు సీఎం చంద్రబాబు, మంత్రులు లోకేష్, టీజీ భరత్‌లతోపాటు కొందరు అధికారులు వెళ్లారు. డిప్యూటీ సీఎం పవన్ ఆ టూర్‌కు దూరంగా ఉన్నారు. అఫ్ కోర్స్.. వ్యక్తిగత కారణాలా, మరేదైనా కావచ్చు. దీనిపై ప్రత్యర్థుల నుంచి జనసేన కేడర్‌ను టార్గెట్ చేస్తూ పోస్టులు చక్కర్లు కొట్టాయి. ఈ వ్యవహారం సోషల్ మీడియా రచ్చయ్యింది. ఈ క్రమంలో పవన్ ఓపెన్ లెటర్ రాశారని అంటున్నారు.

# హైప్రొఫైల్ కేసులో ఇంత అలసత్వమా?




ముంబై:ప్రముఖ నటుడు సైఫ్ అలీ ఖాన్‌పై దాడి కేసులో ముంబై పోలీసుల తీరుపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఘటన జరిగి రెండ్రోజులు గడిచినప్పటికీ.. ఇప్పటికీ నిందితుడి ఆచూకీ కనిపెట్టలేకపోయారు. మరోవైపు.. నిందితుడు మాత్రం పక్కాగా తప్పించుకుంటూ తిరుగుతున్నట్లు స్పష్టమవుతోంది. సైఫ్ అలీఖాన్‌పై దాడి కేసులో ముంబై పోలీసులపై ఇటు సినీవర్గాల, అటు రాజకీయ వర్గాల నుంచి విపరీతమైన ఒత్తిడి నెలకొంది. ఘటన జరిగి 50 గంటలు దాటిపోయినా.. నిందితుడిని, అతనితో సంబంధం ఉన్నవాళ్లెవరినీ పోలీసులు ట్రేస్ చేయలేకపోయారు.

సెలబ్రిటీల విషయంలోనే ఇలా ఉంటే.. మా పరిస్థితి ఏంటని? సాధారణ ప్రజలు సైతం ప్రశ్నిస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఒకవైపు సోషల్‌మీడియాలో ముంబై పోలీసులపై విమర్శలు వెల్లువెత్తుతుండగా.. మరోవైపు నిందితుడు తప్పించుకుంటున్న తీరూ పోలీసులను మరింత ఇబ్బందికి గురి చేస్తోంది.తాజాగా సైఫ్‌పై దాడి చేసిన దుండగుడికి సంబంధించిన మరో ఫొటో బయటకు వచ్చింది. దాడి జరిగిన రోజు.. తల కవర్ అయ్యేలా బ్లాక్ టీ షర్ట్ వేసుకున్నట్లుగా ఫొటోలను తొలుత మీడియాకు పోలీసులు విడుదల చేశారు. ఆపై కొన్నిగంటల వ్యవధిలో విడుదల చేసిన ఫుటేజీలో బ్లూ షర్ట్ కనిపించింది. ఇప్పుడు తాజాగా రిలీజ్‌చేసిన ఫొటోల్లో పసుపు రంగు దుస్తుల్లో కనిపించాడు. బాంద్రా రైల్వే స్టేషన్ సమీపంలోని దొరికిన సీసీటీవీ ఫుటేజీ దృశ్యాలుగా తెలుస్తోంది. దీంతో.. అక్కడ రైలెక్కి నగరంలోని మరో చోటుకి నిందితుడు పారిపోయి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. మరోవైపు ఘటన జరిగిన కొన్ని గంటలకు ఓ దుకాణానికి వెళ్లి హెడ్‌ఫోన్స్ కొన్న వీడియో ఒకటి ఇప్పుడు వైరల్ అవుతోంది.ఈ క్రమంలో ముంబైలోని అన్ని రైల్వే స్టేషన్ల వెంట సీసీకెమెరాలను జల్లెడ పడుతున్నారు. ప్రస్తుతానికి నిందితుడి కోసం గాలింపు చేపడుతున్న బృందాల సంఖ్యను 35కి పెంచారు.

**ప్రత్యక్ష సాక్షి కథనం ప్రకారం..**

దుండగుడ్ని తొలిగా చూసింది సైఫ్ ఇంట పని చేసేవాళ్లు. దీంతో బాంద్రా పోలీసులు వాళ్ల నుంచి వాంగ్మూలం తీసుకున్నారు. నిందితుడి గురించి ఆనవాళ్లను వాళ్ల నుంచి సేకరించారు. సుమారు 35-40 ఏళ్ల మధ్య వయసు ఉండొచ్చని, ఐదున్నర అడుగుల ఎత్తు, ఛామనఛాయ రంగు ఉన్నట్లు వెల్లడించారు. ఇక.. దాడిపై సైఫ్ భార్య కరీనా కపూర్‌తో పాటు ఇతర కుటుంబ సభ్యుల నుంచి కూడా పోలీసులు వాంగ్మూలం సేకరించారు.

**అది అరెస్ట్ కాదు!**

సైఫ్‌పై దాడి ఘటన కేసులో ముంబై పోలీసులు ఇప్పటికే వందకుపైగా మందిని విచారించారు. క్రిమినల్ రికార్డులు ఉన్న మరికొందరిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఓ కార్పెంటర్‌ను పోలీసులు విచారణ కోసం తీసుకొచ్చారు. అయితే సైఫ్ కేసులో నిందితుడు అరెస్ట్ అయ్యాడంటూ.. మీడియా హడావిడి చేసింది. అయితే అతను కేవలం అనుమానితుడు మాత్రమే నని, కేవలం విచారణ జరిపి వదిలేశామని,ఈ కేసులో ఇంతదాకా ఎలాంటి అరెస్ట్ చేయలేదని, అలాంటిది ఏమైనా ఉంటే తామే స్వయంగా ప్రకటిస్తామని ముంబై పోలీసులు స్పష్టత ఇచ్చారు. మరోవైపు ఈ కేసులో వస్తున్న విమర్శలను సీఎం దేవంద్ర ఫడ్నవీస్ ఖండించారు. పోలీసులు అన్నికోణాల్లో.. అన్నివిధాలుగా దర్యాప్తు చేస్తున్నారని, త్వరలోనే నిందితుడిని పట్టుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.

**FIR ప్రకారం..**

ప్రముఖ నటుడు సైఫ్ అలీఖాన్(54)పై బుధవారం అర్ధరాత్రి దాటాక 2గం.30ని. ప్రాంతంలో ఆయన నివాసంలోనే దాడి జరిగింది. ఈ ఘటనపై ఆయన కుటుంబం బాంద్రా పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. ఎఫ్ఆర్‌లో వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి.దుండగుడు ఆ రాత్రి సైఫ్ చిన్నకొడుకు జెహ్ గదిలోకి ప్రవేశించాడు. వెంటనే.. ఆ చిన్నారి సహాయకురాలు సాయం కోసం కేకలు వేసింది. ఆ అరుపులతో గదిలోకి వచ్చిన సైఫ్‌కి దుండగుడికి మధ్య పెనుగులాట జరిగింది. ఈ క్రమంలో తన దగ్గర ఉన్న పదునైన కత్తితో సైఫ్‌ను ఆరుసార్లు పొడిచాడు. ఆ వెంటనే మరో ఇద్దరు సహాయకులపైనా దుండగుడు హాక్సా బ్లేడ్‌తో దాడి చేసి పారిపోయాడు.రక్తస్రావం అయిన సైఫ్‌ను తన?యుడు ఇబ్రహీం, ఇతర కుటుంబ సభ్యులు ఓ ఆటోను పిలిపించి.. లీలావతి ఆస్పత్రికి తరలించారు. అర్ధరాత్రి 3గం. టైంలో సైఫ్‌ను ఆస్పత్రిలో చేర్పించారు. వెన్నెముకకు దగ్గరగా కత్తి ముక్క దిగడంతో సర్జరీ చేసి దానిని తొలగించారు. ఆయనకు ప్రాణాపాయం తప్పిందని వైద్యులు ప్రకటించారు.

# భక్తుల రాకతో కేస్లాపూర్ కిటకిట..వైభవంగా నాగోబా జాతర



ఆదిలాబాద్,ఆదివాసీల ఆరాధ్య దైవం, మెస్రం వంశీయుల కులదైవమైన కేస్లాపూర్ నాగోబా భక్తుల పూజలు అందుకొనున్నాడు. వారం రోజులపాటు భక్తుల రాకతో కేస్లాపూర్ కిటకిటలాడనుంది. పుష్య అమావాస్య రోజున అర్ధరాత్రి పవిత్ర గంగాజలంతో నాగోబా అభిషేకం తర్వాత మహాపూజ ప్రారంభించి నాగోబా జాతర ప్రారంభం కానుంది. అందుకోసం మెస్రం వంశీయులు ఈనెల 10వ తేదీన కేస్లాపూర్ నుంచి గంగాజల పాదయాత్ర చేపట్టి వందల మైళ్ళు కాలినడకన గోదావరిలోని హస్తలమడుగు వద్దకు చేరుకుంది. పవిత్ర గంగాజలాన్ని సేకరించి తిరుగు ప్రయాణంలో ముందస్తుగా చేపట్టిన ఆచార సాంప్రదాయాల్లో మొదటి ప్రధాన ఘట్టాన్ని పూర్తిచేసుకుని ఇంద్రవెల్లిలో ఇంద్రాదేవికి మహాపూజ నిర్వహించారు. ఆపై కాలినడకన పవిత్ర గంగాజలంతో మెస్రం వంశ పెద్దలు వారి వెంట మేస్రం వంశ కుటుంబాలు ఎడ్లబండ్లతో కుటుంబ సమేతంగా కేస్లాపూర్ లోని మర్రిచెట్ల వద్దకు చేరుకున్నారు. శనివారం నుంచి రెండు రోజులపాటు మర్రిచెట్ల వద్దనే బస చేసి సాంప్రదాయ ఆచార కార్యక్రమాలను కొనసాగిస్తారు. ఈనెల 28వ తేదీ నాడు కేస్లాపూర్ లోని నాగోబా ఆలయ ప్రాంగణంలోని గోవాడ వద్దకు చేరుకుని, గంగాజలంతో నాగోబా ఆలయానికి మెస్రం వంశీయులు చేరుకుంటారు. ఆలయ శుద్ధి తర్వాత అర్ధరాత్రి నాగోబాకు పవిత్ర గంగాజలంతో అభిషేకం నిర్వహించి మహాపూజ ప్రారంభించనున్నారు. అనంతరం నాగోబా జాతర ప్రారంభం కానుంది. నాగోబా జాతర ఏర్పాట్లపై ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజార్షి షా, ఐటీడీఏ పీవో కుష్బూ గుప్తా, జిల్లా ఎస్పీ గౌస్ ఆలం, ఎండోమెంట్ అధికారులు,ఇతర జిల్లా ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జాతర ఏర్పాట్లపై అధికారులు పనులు పూర్తి చేయాలని, జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసేలా ముందస్తుగా చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ముందుగా నాగోబా జాతరకు సంబంధించిన పరిసర ప్రాంతాలలో ఏర్పాట్లను పరిశీలించారు. మర్రిచెట్టు ప్రాంతం, కోనేరు, గోవాడ్, తై బజార్, స్టాల్స్, దేవాలయ ప్రాంతం, తదితర ప్రాంతాలలో చేపడుతున్న పనులను పరిశీలించి, పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జాతర ఏర్పాట్లు, చేపట్టవలసిన పనుల వివరాలను వివిధ శాఖల వారీగా అడిగి తెలుసుకున్నారు.

**త్వరగా ఏర్పాట్లు పూర్తి చేయాలి.. జిల్లా కలెక్టర్ రాజార్షి షా**

ఈ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. ఆయా ముఖ్యమైన శాఖలకు సంబంధించిన విధులను షిఫ్ట్ ల వారిగా కేటాయించడం జరిగిందనీ, వారం రోజుల పాటు జరిగే నాగోబా జాతరలో సంబంధిత అధికారులు విధులు నిర్వహించడం జరుగుతుందనీ అన్నారు. ముఖ్యమైన కూడళ్లలో ప్లెక్సీలు ఏర్పాటు చేయాలని, కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. భక్తులకు ఎక్కడ కూడా ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా చూడాలని, ప్రశాంతంగా దైవదర్శనం చేసుకొని, తిరుగు ప్రయాణం చేసేంతవరకు అన్ని చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు. జాతరకు పొరుగున ఉన్న మహారాష్ట్రతో సహా సుదూర ప్రాంతాల నుండి ఉన్నతాధికారులు, ఆదివాసీ మెస్రం వంశీయులు, తదితర భక్తులు ఈ జాతరకు తరలివస్తారని అన్నారు. సమీక్షలలో అనంతరం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలోనే అతిపెద్ద మహా జాతర నాగోబా జాతర అని, ఈ జాతరను అందరి సమన్వయంతో విజయవంతం చేయాలనీ అన్నారు. ముఖ్యంగా జాతరకు సంబంధించి ప్రతి బస్ కు నాగోబా జాతర నిర్వహించు స్టిక్కర్లను అతికించాలని, నాగోబా జాతర అన్ని జిల్లాలకు తెలిసేలా అన్ని బస్టాండ్ లలో, బస్‌లకు స్టిక్కర్లు వేయాలని తెలిపారు. ముఖ్యంగా జాతర లో హొటల్స్, తినుబండారాలు, తదితర వ్యాపారులు కొనుగోలు చేయడం జరుగుతుందని, ఈ సందర్భంగా ఆహారం కలుషితం కాకుండా, నిలువ ఉంచకుండా ఎప్పటికప్పుడు ఏరోజుకారోజు నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చూడాలని ఆహారాభద్రతా కమిటి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అన్నారు. జిల్లా ఎస్పీ గౌస్ ఆలం మాట్లాడుతూ.. నాగోబా జాతరకు సంబంధించి అన్ని పకడ్బందీ ఏర్పాట్లు చేయడం జరిగిందని, బారికేడ్లు, పోలీస్ బందోబస్తు, పోలీస్ క్యాంప్ ను ప్రతి ఏడాది లాగే ఏర్పాటు చేయడం జరుగుతుందని, జాతరకు వచ్చే భక్తులకు ట్రాఫిక్ సమస్యలు ఏర్పడకుండా అన్నిచోట్ల ప్రత్యేక పోలీసు బందోబస్తును తదితర ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ.. వారం రోజుల పాటు జరిగే జాతరలో భక్తులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని, ఈ నెల 28న రాత్రి మహాపూజ, 31న ప్రజా దర్బార్ నిర్వహించడం జరుగుతుందనీ, అధికారులు అన్ని చర్యలు చేపట్టి విజయవంతం చేయాలని అన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మార్మట్, ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్, ఆలయ కమిటి సభ్యులు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# 32 ఏళ్ల తర్వాత అక్కడకు వెళ్లిన సీఎంగా రేవంత్ రికార్డు



హైదరాబాద్,అంచనాలు పెద్దగా లేని ప్రముఖులకు ఉండే లాభాలే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ కు ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో విజయం సాధించటం.. పార్టీ అధినాయకత్వం సైతం రేవంత్ మీద నమ్మకం పెట్టుకొని ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చోబెట్టటం వరకు ఒక ప్రహసనం అయితే.. ఆ కుర్చీలో కుదురుకోవటం.. ఒక్కొక్కటిగా తాను చేయాలనుకున్న పనుల్ని చేసుకుంటూ వెళ్లటం అంత సామాన్యమైన విషయం కాదు. ముఖ్యమంత్రి రేవంత్ ఆ దశల్ని ఒక్కొక్కటిగా దాటుకుంటూ ముందుకు వెళుతున్నారు.ఆయన మీదా.. ఆయన పాలన మీద పెద్దగా అంచనాలు లేవు. దీనికి తోడు సీనియర్ కాంగ్రెస్ నేతలు ఎవరి దారి వారిదే అన్నట్లుగా నడుచుకుంటున్న వేళ.. అందరిని ఒక తాటిన తీసుకెళ్లకపోయినా.. ఒకే బాటలో నడుస్తున్న భావన కలిగేలా చేయటమే అతి పెద్ద సవాలు. ఈ విషయంలోనూ రేవంత్ విజయం సాధించారు. ఇప్పుడు తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకునే దిశగా ఆయన అడుగులు పడుతున్నాయి. దావోస్ పర్యటన సందర్భంగా.. అలా వెళ్లి.. ఇలా రావటం.. మహా అయితే కాసిన్ని పెట్టుబడులు తీసుకురావటమే అనుకున్నారు కానీ.. అందుకు భిన్నంగా రికార్డు స్థాయిలో దగ్గరదగ్గర ఒకటిన్నర లక్షల కోట్ల రూపాయిల పెట్టుబడుల్ని ఆకర్షించటం సామాన్యమైన విషయం కాదు.గత ప్రభుత్వంలో షాడో సీఎంగా వ్యవహరించిన కేటీఆర్ సైతం ఈ మార్కు కాదు కదా.. ఇందులో సగం పెట్టుబడుల్ని సైతం సాధించుకొచ్చింది లేదు. ఆ లెక్కన చూస్తే.. సీఎం రేవంత్ ఘన విజయాన్ని సొంతం చేసుకున్నట్లే. ఇటీవల కాలంలో ఆయన తీరు చూస్తే.. నెమ్మది నెమ్మదిగా తనను తాను విస్తరించుకుంటున్న వైనం కనిపిస్తుంది. గత ముఖ్యమంత్రి మాదిరి పరిమిత కార్యక్రమాలకు హాజరు కావటం.. ప్రజలకు అందుబాటులో లేకుండా ఉండటం లాంటి తీరుకు భిన్నంగా అందరికి హ్యాండీగా ఉండే ముఖ్యమంత్రిగా తన ఇమేజ్ ను పెంచుకుంటున్నారు.రిపబ్లిక్ డే వేళ.. పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న ఆయన.. అదే సమయంలోజూబ్లీహిల్స్ లోని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమానికి హాజరయ్యారు. ఇక్కడ ఆసక్తికర అంశం ఏమంటే.. దాదాపు 32 ఏళ్ల తర్వాత ఈ వర్సిటీలో అడుగు పెట్టిన మొదటి ముఖ్యమంత్రిగా రేవంత్ రికార్డును క్రియేట్ చేవారు. గతంలో మాజీ ప్రధానమంత్రి దివంగత పీవీ నరసింహారావు.. దివంగత మాజీ సీఎం కోట్ల విజయభాస్కర్ రెడ్డిలు మాత్రమే సందర్శించారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ మాత్రమే హాజరైంది.ఈ కార్యక్రమంలో భాగంగా విశ్వవిద్యాలయం కొండపై 15 అడుగుల ఎత్తులో నిర్మించిన అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించటంతో పాటు.. రూ.30 కోట్లతో ఏర్పాటు చేస్తున్న డిజిటల్ రిసోర్స్ సెంటర్ పనుల్ని ప్రారంభించారు. దీంతో పాటు మరిన్ని పనుల్ని ప్రారంభించిన ఆయన.. వర్సిటీకి సంబంధించిన రూ.500 కోట్ల ఆస్తులు ఇంకా ఏపీలోనే ఉన్నట్లుగా గుర్తు చేసుకోవటం చూస్తే.. ముఖ్యమంత్రి రేవంత్ ఏ విషయాన్ని వదిలి పెట్టేలా లేరన్న అభిప్రాయం కలుగక మానదు.

# సినీ తారలతో కమల విలాసం...

హైదరాబాద్,కేంద్రంలో అధికారంలో గత పదేళ్ళుగా ఉన్న బీజేపీ సినీ తారల మీద ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. వారికి అర్హత ఉన్నా అవార్డులు దక్కకపోవడాన్ని గమనిస్తూ వాటిని సరైన సమయంలో అందజేయడం ద్వారా తారల అభిమానాన్ని పొందుతోంది.తమిళనాడులో చూస్తే రజనీకాంత్ కి పద్మ విభూషణ్ 2017లో బీజేపీ ప్రభుత్వం ప్రకటించింది. ఆ తరువాత ఆయనకు దాదా సాహెబ్ ఫాల్కే అవార్డుని కూడా ప్రకటినించి. గత ఏడాది మరణించిన తమిళనాడు స్టార్ డీఎండీకే పార్టీ ప్రెసిడెంట్ అయిన విజయ్ కాంత్ కి మరణాంతరం పద్మభూషణ్ ని ప్రకటించింది. ఆయనకు ప్రత్యేకంగా అభిమానం గణం ఉంది. అలాగే ఆయన పార్టీ క్యాడర్ కూడా బలంగా ఉంది. దాంతో బీజేపీ ఆయన అభిమానులను తిప్పుకునే ఎత్తుగడగా ఇలా చేసింది అని అంటున్నారు.ఇక ఇపుడు చూస్తే తమిళ స్టార్ అజిత్ కుమార్ కి పద్మ భూషణ్ అవార్డుని కేంద్రం ప్రకటించింది. ఆయన మూడు దశాబ్దాలుగా సూపర్ స్టార్ గా తమిళనాడులో ఉన్నారు. ఆయన 1991లో ప్రేమ పుస్తకం అనే తెలుగు సినిమా ద్వారానే వెండి తెరకు పరిచయం అయ్యారు. ఆయనకు అక్కడ మంచి ఫాలోయింగ్ ఉంది.దాంతో దీని మీద అక్కడ మరో సూపర్ స్టార్ కొత్తగా పార్టీ పెట్టి రాజకీయాల్లోకి వస్తున్న విజయ్ ఫ్యాన్స్ అయితే ఫైర్ అవుతారు. తమ హీరో రాజకీయాల్లోకి వస్తున్న వేళ తోటి స్టార్ కి పురస్కారం ఇవ్వడం రాజకీయమేనని వారు అంటున్నారు. అజిత్ విషయానికి వస్తే ఆయనకు రాజకీయ వాసనలు లేవు. కానీ ఆయనను అన్నాడీఎంకే పార్టీ వారు ఎక్కువగా అభిమానిస్తారు అని చెబుతారు.తమిళనాడులో 2026లో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో విజయ్ ఫ్యాన్స్ వైపు నుంచి ఈ రకమైన కామెంట్స్ వస్తున్నాయి. ఇక ఏపీలో



చూస్తే 2024 ఎన్నికలకు ముందు మెగాస్టార్ కి పద్మ విభూషణ్ అవార్డు దక్కింది. ఆయన ఈ అవార్డుకు అన్ని విధాలుగా అర్హుడే అయినా బీజేపీ పెద్దలు ఆయనకు తమ వైపు తిప్పుకోవాలని చాలా కాలంగా ప్రయత్నిస్తున్నారు అని ప్రచారంలో ఉంది.ఇపుడు బాలయ్యకు పద్మభూషణ్ అవార్డు దక్కింది. ఆయనకు అవార్డు దక్కడం పట్ల అంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బాలక్రిష్ణ నివాసానికి స్వయంగా వెళ్ళి ఆయనకు అత్యున్నత పౌర పురస్కారం దక్కినందుకు అభినందించారు. ఈ సందర్భంగా ఇద్దరూ కొంతసేపు మాట్లాడుకున్నారు.మరో వైపు మెగాస్టార్ చిరంజీవితోనూ కిషన్ రెడ్డి మంచి సాన్నిహిత్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఇపుడు బాలయ్యతోనూ ఆయన భేటీ వేశారు. దీంతో సినీ తారలతో కమల విలాసానికి కొత్త ఆలోచనలు చేస్తున్నారా అన్న చర్చ అయితే సాగుతోంది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com